అపజయాలను తప్పటడుగులని
ఎప్పుడూ అనుకోవద్దు..
అవి తప్పులు కావు.. భవిష్యత్తులో
మనమేం చేయొద్దో తెలిపే పాఠాలు..
- అబ్దుల్ కలామ్



Truth of News
PRGI Reg No: APTEL/26/A4781

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

అన్నమయ్య జిల్లా | సంపుటి: 03 | సంచిక : 56 | ఆదివారం 04 అక్టోబర్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

## సత్యాన్ని అణచివేస్తే ప్రతిఘటిస్తాం

- సత్యం పక్షాన నిలబడటమే గొప్ప ఆయుధం
- మీ కోసం ఏ చోటైనా సరే.. నా శక్తిమేర కృషి చేస్తా
- నిరసన గళాలను ఏకం చేయడమే 'సత్యాగ్రహ' లక్ష్యం
- కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ




న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

దేశవ్యాప్తంగా సత్యాన్ని అణచివేస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఈ అణచివేతను ప్రతిఘటించడమే ప్రతిపక్ష నేతగా తన బాధ్యత అని, ఈ విషయంలో ప్రతిచోటా ప్రజలకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. సత్యమే మన గొప్ప ఆయుధమని బాపూజీ మనకు బోధించారు.

- మిగతా 2లో..

## లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయాలి

- దేశంలో జరిగినవన్నీ అక్రమ ఎన్నికలేనన్న మల్లికార్జున ఖర్గే
- మోదీ, అమిత్ షాతో పాటు అందరూ అక్రమంగా పదవుల్లో ఉన్నారని వ్యాఖ్య
- ఈవీఎంల దుర్వినియోగం జరిగిందని ఆరోపణ



న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేస్తూ, తీవ్రమైన డిమాండ్‌ను

- మిగతా 2లో..



## జ్ఞానేశ్‌కు సీజేపీ డెడ్‌లైన్

- ఈ నెల 10 లోపు తప్పుకోవాల్సిందే..
- లేకుంటే అదేరోజు జంతర్ మంతర్ 2.0 తప్పదు
- సీజేపీ వ్యవస్థాపక నేత అభిజీత్‌దిప్కే వార్నింగ్
- మమతకు దీప్కే కృతజ్ఞతల పోస్ట్‌పై 'ఎక్స్' ఆంక్షలు

ముంబై - సూర్య వాస్తవం

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతాపార్టీ డెడ్‌లైన్ విధించింది. ఈ నెల 10 వరకు తప్పుకోకపోతే అదేరోజు ఢిల్లీలోని

- మిగతా 2లో..

## శ్రీసిటీలో ఘోర ప్రమాదం..

- టాబ్లెట్స్ ఇండియా లిమిటెడ్‌లో బాయిలర్ విస్ఫోటనం
- ఐదుగురు మృతి - పలువురికి గాయాలు
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన చంద్రబాబు, లోకేశ్
- గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశాలు
- ఒక్కో కుటుంబానికి 50 లక్షల నష్టపరిహారం
- కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్



దొరవారిసత్రం- సూర్య వాస్తవం:

సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని శ్రీసిటీసెజ్ పారిశ్రామిక వాడలో "టాబ్లెట్స్ ఇండియా లిమిటెడ్" పరిశ్రమలో శని వారం ఉదయం సుమారు 8:30 గంటల ప్రాంతంలో ఆకస్మిక పేలుడు సంభవించ డంతో దురదృష్టవశాత్తు ఐదుగురు మరణించారని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శ్రీసిటీ పరిధిలో గల విదేశీ ఎగుమతులు చేపట్టే ఔషధాల తయారీ పరిశ్రమలోని 2 టన్నుల సామర్థ్యం గల బాయిలర్ ఆకస్మికంగా పేలిపోవడంతో ఐదుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారన్నారు. పేలుడు ధాటికి బాయిలర్ వద్ద పనిచేస్తున్న ముగ్గురు అక్కడికక్కడే మరణించగా, ఎగసిపడిన శిథిలాలు తగలడంతో మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఒక బాయిలర్ ఆపరేటర్, ఇద్దరు ఈటీపీ సిబ్బందితో పాటు మరో ఇద్దరు కార్మికులు ఉన్నారన్నారు. మరణించిన వారిలో ఒకరు కోల్‌కతా, ఇద్దరు తమిళనాడు, మరో ఇద్దరు స్థానికంగా చెర్వి, తడ ప్రాంతాలకు చెందినవారన్నారు. ప్రమాదంలో మరెవరికీ గాయాలు కాలేదన్నారు. ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు వెంటనే స్పందించి, బాధితులను అన్ని విధాలా ఆదుకోవాలని, సహాయ చర్యలు వేగవంతం చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారన్నారు. సమాచారం అందుకున్న వెంటనే జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడుతో కలసి ఇతర అధికారులు ఉదయం 10:00-10:30 గంటల మధ్యలోనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారన్నారు. మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తయిందని,దహన సంస్కారాల కోసం శ్రీసిటీ యజమాన్యం తగిన ఏర్పాట్లు చేస్తోందని అధికారులు తెలిపారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి

- మిగతా 2లో..



## కర్ణాటకలో కరువు పరిస్థితి పంట నష్టం అంచనా

### - రాష్ట్రానికి చేరుకున్న కేంద్ర బృందం; సీఎం సమావేశం

బెంగళూరు- సూర్య వాస్తవం:

రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితి, పంట నష్టాలపై ముఖ్యమంత్రి డీకే శివకుమార్ శనివారం, కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ అజిత్ కుమార్ సాహు నేతృత్వంలోని కేంద్ర అంతర్-మంత్రివర్గ బృందంతో చర్చలు జరిపారు. రాష్ట్రంలోని క్షేత్రస్థాయి పరిస్థితిని అంచనా వేయడానికి మరియు వర్షాలు లేకపోవడం వల్ల జరిగిన నష్టం తీవ్రతను అంచనా వేయడానికి ఒక కేంద్ర బృందం కర్ణాటకకు చేరుకుంది. అదనపు ప్రాంతాలలో కూడా క్షేత్రస్థాయి వాస్తవ పరిశీలనలు జరుగుతున్నాయి.

**ప్రధానమంత్రి మోదీకి ఖర్గే రాసిన లేఖ**

రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే, కర్ణాటకలోని రైతులకు తక్షణ కేంద్ర సహాయం అందించాలని కోరుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ఇటీవలి సంవత్సరాలలో కర్ణాటక ఈ ఏడాది

- మిగతా 2లో..



## ఎస్ఐఆర్ కుట్రపూరితం.. సీఈసీ తక్షణమే వైదొలగాలి

- ఎస్ఐఆర్ పై మరోసారి విమర్శలు గుప్పించిన ప్రకాశ్ రాజ్
- ఇంట్లో లేని వాళ్ల ఓట్లు కూడా తొలగించారని మండిపాటు
- దళితులు, ముస్లింలే టార్గెట్ అని ఆరోపణ

2లో

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## క్యూ-శివ, అమరావతి డిక్లరేషన్..

### - పాన్ ఐఐటీ సమ్మిట్ లో కీలక ఘట్టాలను ఆవిష్కరించిన చంద్రబాబు

- విజయవాడలో పాన్ ఐఐటీ సమ్మిట్-2026
- హాజరైన సీఎం చంద్రబాబు
- డీప్‌టెక్ స్టార్టప్‌ల కోసం రూ.500 కోట్ల వెంచర్ ఫండ్ ఏర్పాటు
- అమరావతిలో శాశ్వత పాన్ ఐఐటీ కౌన్సిల్ ఏర్పాటుకు నిర్ణయం
- వచ్చే ఫిబ్రవరి నుంచి అమరావతిలో క్వాంటం కంప్యూటర్ ఆపరేషన్స్
- క్వాంటం వ్యాలీగా అమరావతిని తీర్చిదిద్దుతామన్న సీఎం చంద్రబాబు




న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు సాంకేతిక ప్రగతికి, పెట్టుబడులకు కేంద్రంగా నిలవనుందన డానికి విజయవాడలో జరిగిన పాన్ ఐఐటీ అమరావతి సమ్మిట్ 2026 నిలువుటద్దం పట్టింది. ఈ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి పలు కీలక ఘట్టాలు ఆవిష్కృతమయ్యాయి. డీప్‌టెక్నాలజీ అభివృద్ధికి ఊతమిచ్చేలా రూ.500 కోట్ల వెంచర్ ఫండ్ ఏర్పాటు చేస్తూ చారిత్రక 'అమరావతి డిక్లరేషన్' విడుదల చేయడంతో పాటు, "మేకిన్ అమరావతి" సంకల్పంతో రూపొందించిన ఐదు "క్యూ-శివ" క్వాంటం కంప్యూటర్లను సీఎం ఆవిష్కరించారు. క్యూబిట్ ఫోర్స్ సంస్థ, చండీఘడ్ యూనివర్సిటీ సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఈ క్యూ-శివ కంప్యూటర్లు మినీ టెస్టింగ్ క్వాంటం ల్యాబ్‌లుగా పనిచేస్తాయి. వీటితో పాటు 4 కెల్విన్ ప్రాసెసర్ 'సృష్టి'ని కూడా ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్యూబిట్ సంస్థ సీఈఓ వెంకటసుబ్రమణ్యం మాట్లాడుతూ.. ఈ కంప్యూటర్ల తయారీకి అవసరమైన కొన్ని కీలక కాంపోనెంట్లు ప్రపంచంలో ఒకటి రెండు చోట్ల మాత్రమే లభిస్తాయని, అలాంటివి మన మచిలీపట్నంలో దొరకడం విశేషమని తెలిపారు.

- మిగతా 2లో..

## పిల్లల ఆన్‌లైన్ భద్రతకు ప్రత్యేక ఫ్రేమ్‌వర్క్

- ఆన్‌లైన్‌లో పిల్లల సేఫ్టీ.. అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు
- మహిళలు, పిల్లల రక్షణే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని వెల్లడి
- సైబర్ క్రైమ్‌కు 1930, చైల్డ్ హెల్ప్‌లైన్‌కు 1098 నంబర్లు గుర్తుంచుకోవాలని సూచన

2లో



# సత్యాన్ని అణచివేస్తే ప్రతిఘటిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

కానీ సత్యం పక్షాన నిలబడటం కూడా అంతకంటే గొప్ప ఆయుధమని అన్నారు. 'మీ కోసం ఏ చోటైనా సరే.. నా శక్తిమేర కృషి చేస్తా' అని తేల్చిచెప్పారు. దేశవ్యాప్తంగా ప్రజలు తమ హక్కుల కోసం పోరాడుతున్నారని, ఈ ఒంటరి గళాలను ఏకం చేయడమే 'సత్యాగ్రహ' డిజిటల్ వేదిక లక్ష్యమని రాహుల్ గాంధీ వెల్లడించారు. మహాత్మాగాంధీ 157వ జయంతి మరుసటి రోజైన శనివారం రాహుల్ న్యూఢిల్లీలో 'సత్యాగ్రహ' డిజిటల్ వేదికను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సత్యం అణచివేయబడుతున్న చోట ప్రజలకు సహాయం అందేలా చూసేందుకు ఈ వేదిక అవసరమని, ప్రభుత్వంపై తమ నిరసన లను ఈ వేదికపై నమోదు చేయాలని ప్రజలను కోరారు. దేశంలో ప్రజలు తమ హక్కుల కోసం పోరాడుతున్నారని, అయితే తరచుగా ఒంటరిగానే పోరాడాల్సి వస్తోందన్నారు. 'జెన్-జెడ్' యువత, విద్యార్థులు, రైతులు, ఆదివాసీలు, దళితులు, మహిళలు... ఇలా ప్రతి పోరాటానికి ఒక ప్రత్యేక కథనం ఉంది.

కానీ ఒంటరి గళాన్ని అణచివేయడం సులభం. 'ఆ గళాలన్నింటినీ ఒకే వేదికపైకి (మ్యాప్‌పైకి) తీసుకు రావడమే 'సత్యాగ్రహ' లక్ష్యం అని ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు. మహాత్మాగాంధీని స్మరించుకుంటూ, 'సత్యమే మన గొప్ప ఆయుధమని బాపూజీ మనకు బోధించారు. కానీ సత్యం పక్షాన నిలబడటం అంతకంటే గొప్ప ఆయుధం. మీరు కూడా ఏదైనా అన్యాయానికి వ్యతిరే కంగా పోరాడుతుంటే, మీ కథనాన్ని ఈ వేదికలో పంచుకోండి. దీనికి కేవలం రెండు నిమిషాలు మాత్రమే పడుతుంది' అన్నారు. 'మీలాగే సొంత పోరాటం చేస్తున్న ఇతరులు ఎవరో కూడా మీరు చూడవచ్చు' అని తెలిపారు. 'మీకు అండగా నిలవడానికి పార్లమెంటులో, వీధుల్లో, లేఖల ద్వారా లేదా నేను అవసరమైన ఏ చోటైనా సరే... నా శక్తిమేర కృషి చేస్తాను. ప్రతిపక్ష నాయకుడిగా అది నా బాధ్యత. మీ సత్యాగ్రహం గురించి కథను నాకు చెప్పండి' అని స్పష్టం చేశారు. భూమి హక్కులు, మహిళల హక్కులు, దళిత హక్కులు, ఓబీసీ హక్కులు, విద్య, పరీక్షలకు సంబంధించిన అంశాలపై దేశవ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ నిరసనలను వ్యవస్థీకరించడంలో, వాటిని ఒకే వేదికపైకి తీసుకురావడంలో, 'మీరు పోరాడుతున్న సమస్యల పరిష్కారానికి సహాయపడేలా మీతో పనిచేయడానికి మేము తోడుంటాం. సత్యాగ్రహ వెబ్‌సైట్‌ను చూ డండి. ఫారమ్‌ను నింపండి. మీ ఉద్యమాన్ని నమోదు చేయండి' అని పేర్కొన్నారు.

# లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

తెరపైకి తెచ్చారు. దేశంలో జరిగిన ఎన్నికలన్నీ అక్రమమని ఆరోపిస్తూ, లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కర్ణాటకలోని కలబుర్గిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, దేశంలో ప్రస్తుత పాలన మొత్తం చట్టవిరుద్ధమైన ఎన్నికల పునాదిపైనే నడుస్తోందని ఆరోపించారు. ఈవీఎంల దుర్వినియోగం, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)లో జరుగుతున్న అవకతవకల కారణంగానే ఈ డిమాండ్ చేస్తున్నట్లు ఖర్గే స్పష్టం చేశారు. "ఈ రోజు దేశం మొత్తం అక్రమ ఎన్నికల ద్వారానే నడుస్తోంది. మోదీ అక్రమ ప్రధాని, అమిత్ షా అక్రమ మంత్రి అని, దేశంలో ఎన్నికైన ముఖ్యమంత్రులందరూ అక్రమంగా ఆ పదవుల్లో ఉన్నట్టేనని అన్నారు. వాటన్నింటినీ రద్దు చేసి, కేవలం బ్యాలెట్ పత్రాలతోనే మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి" అని చెప్పారు. ఈ అంశంపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీతో పాటు ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలతో కూడా చర్చించినట్లు ఖర్గే తెలిపారు. ఈ అక్రమాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించామని, అందులో భాగంగా అక్టోబర్ 6వ తేదీన ఢిల్లీలో విపక్ష ఎంపీలందరూ కలిసి ఎన్నికల సంఘం కార్యాలయానికి నిరసన ర్యాలీ నిర్వహిస్తారని వివరించారు. ఓటర్ల జాబితా నుంచి కొన్ని వర్గాల ప్రజల పేర్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిపై యువతలో చైతన్యం కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.

# శ్రీసిటీలో ఘోర ప్రమాదం..

(మొదటిపేజీ తరువాయి)

రూ.50 లక్షల చొప్పున పరిహారం రాబోయే 2 రోజుల్లో అంద జేయడం జరుగుతుందన్నారు. మృతుల పిల్లల ఉన్నత చదువులతో సహా అన్ని విద్యా ఖర్చులను శ్రీసిటీ యాజమాన్యమే భరిస్తుందన్నారు. అర్హులైన కుటుంబ సభ్యులకు శ్రీసిటీ లేదా పరిసర పరిశ్రమల్లో తక్షణమే ఉద్యోగావకాశం కల్పిస్తారన్నారు. బాధ్యులపై ప్రిలిమినరీ కేస్ నమోదు చేయడంతో పాటు బాయిలర్, ఫ్యాక్టరీస్, ఇండస్ట్రీస్ పోలీస్ శాఖల ఉన్నతాధికారులతో కూడిన ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేశారు. సాంకేతిక విచారణ అనంతరం నిర్లక్ష్యానికి కారణమైన వారిపై తగిన కఠిన చర్యలు తీసుకుంటారన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన తిరుపతి బాయిలర్ ఇన్స్పెక్టర్‌ను తక్షణమే సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. గత 18 ఏళ్లలో శ్రీసిటీలో ఇటువంటి ప్రమాదం జరగడం ఇదే తొలిసారను, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండటానికి శ్రీసిటీలోని అన్ని పరిశ్రమల్లో వెంటనే థర్డ్ పార్టీ సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ సమావేశంలో సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, సూళ్లూరుపేట ఆర్డిఓ దేవేందర్ రెడ్డి, నాయుడుపేట డిఎస్పి చెంచు బాబు, శ్రీ సిటీ ఎండి రవి అన్నా రెడ్డి, తదితరులు ఉన్నారు.

## ఎస్ఐఆర్ కుట్రపూరితం..

# సీఈసీ తక్షణమే వైదొలగాలి

**- ఎస్ఐఆర్ పై మరోసారి విమర్శలు గుప్పించిన ప్రకాశ్ రాజ్**

**- ఇంట్లో లేని వాళ్ల ఓట్లు కూడా తొలగించారని మండిపాటు**

**- దళితులు, ముస్లింలే టార్గెట్ అని ఆరోపణ**

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని నటుడు, సామాజిక కార్యకర్త ప్రకాశ్ రాజ్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా వివాదాస్పదమైన ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఉద్దేశపూర్వకంగానే కొందరి ఓట్లను తొలగించేందుకు ఈ ప్రక్రియ చేపట్టారని, ఇది రాజ్యాంగ విరుద్ధమని ఆరోపించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ కింద దేశవ్యాప్తంగా సుమారు 13.4 కోట్ల మంది ఓటర్ల పేర్లను ముసాయిదా జాబితాల నుంచి తొలగించడం తీవ్ర వివాదానికి దారితీసింది. ముఖ్యంగా వలస కార్మికులు, దళితులు, ముస్లింల ఓట్లను లక్ష్యంగా చేసుకుని తొలగిస్తున్నారని ప్రకాశ్ రాజ్ ఆరోపించారు. ఇప్పటికే ఏటా ఓటర్ల జాబితా పరిశీలన జరుగుతుండగా, కొత్తగా ఈ ప్రత్యేక సవరణ ఎందుకని ఆయన ప్రశ్నించారు. దేశంలో అక్రమ చొరబాటుదారులు ఉంటే, ఇన్నాళ్లూ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఏం చేసింది? అని నిలదీశారు. ఇంట్లో లేని వాళ్ల ఓట్లను తీసేశారని మండిపడ్డారు. ముస్లింలు, దళితుల ఓట్లను తొలగించడమే వారి ముఖ్య ఉద్దేశమని ఆరోపించారు. మరోవైపు, దేశవ్యాప్త నిరసనల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. జాబితాల నుంచి పొరపాటున తొలగించిన అర్హులైన ఓటర్ల పేర్లను తిరిగి చేర్చేందుకు నెల రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని అధికారులను ఆదేశించింది.

# జ్ఞానేశ్‌కు సీజేపీ డెడ్‌లైన్

(మొదటిపేజీ తరువాయి)

'జంతర్ మంతర్ 2.0' నిరసన సత్తా ఏంటో చూపిస్తామని సీజేపీ నేత అభిజీత్ దిప్కే వార్నింగ్ ఇచ్చారు. ఒకవేళ ఢిల్లీపోలీసులు తమ నిరసనకారులను ఎక్కడ అడ్డగిస్తోందో అక్కడా తమ జంతర్‌మంతర్ అవుతుందని హెచ్చరించారు. తమ నిరసన శాంతియుతంగా ఉంటుందని చెబుతూ, 'మేము మహాత్మా గాంధీ చూపిన మార్గంలో నడుస్తాం' అని స్పష్టం చేశారు. శాంతియుత నిరసన హక్కును గౌరవించాలా లేక 'జూలై 20న చూసిన అరాచకాన్ని పునరావృతం చేయాలా' అనేది ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులే నిర్ణయించుకోవాలని ఆయన సవాల్ విసిరారు. ఈ మేరకు శుక్రవారం అర్ధరాత్రి 'ఎక్స్'లో పోస్టు చేశారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయకపోతే, దేశవ్యాప్తంగా ఉన్న కాక్రోచ్‌లు (పార్టీ కార్యకర్తలు/మద్దతుదారులు) ఢిల్లీకి తరలి వస్తారని, ఈ నెల 10న జంతర్ మంతర్ వద్ద నిరసన తెలుపుతారని స్పష్టం చేశారు. ఇది భారత ప్రజాస్వామ్యాన్ని కాపాడే పోరాటమని, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలను కోరుకునే ప్రతి పౌరుడూ ఇందులో భాగస్వాములు కావాలని అభిజీత్‌దీప్కే పిలుపు ఇచ్చారు. ఇదిలా ఉంటే తమ ఉద్యమానికి మద్దతు ఇచ్చినందుకు పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమత బెనర్జీకి అభిజీత్‌దీప్కే కృతజ్ఞతలు తెలులిపారు. శనివారం తాను చేసిన ఈ పోస్టుపై 'ఎక్స్ ఆంక్షలు విధించింది.

ఈ నేపథ్యంలో ఈ నెల10 లోపు తన 'ఎక్స్' ఖాతా తొలగించినా ఆశ్చర్యం లేదని ఆయన స్పష్టం చేశారు. కాక్రోచ్ ఉద్యమానికి 'మీ మద్దతును అందించినందుకు ధన్యవాదాలు మేడమ్. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు భారతీయులందరూ ఏకం కావాలి' అని మమతకు పోస్టు చేశారు. దీన్ని టీఎంసీ రాజ్యసభ జాయింట్ సెక్రటరీ డెరెక్ ఓబ్రియన్ షేర్ చేశారు. ఆ తర్వాత దానిపై ఎక్స్ ఆంక్షలు విధించింది. ఇదిలా ఉంటే.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ల గురించి అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై సీజేపీ నేత అభిజీత్ దీప్కేను కేంద్ర సామాజిక న్యాయ శాఖ సహాయ మంత్రి రాందాస్ అథవాలే శనివారం విమర్శించారు.

ఆయన ఇలాంటి వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని, లేకపోతే రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్పీఐ) ఆయనపై కఠిన చర్యలు తీసుకుంటుందని అథవాలే ముంబైలో మీడియాతో పేర్కొన్నారు. రాజ్యాంగం ద్వారా అంబేద్కర్ దేశ పురోగతికి ఎంతో కృషి చేశారని పేర్కొన్న అథవాలే, చరిత్రను పరిగణనలోకి తీసుకోకుండా దీప్కే వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు.

# క్యూ-శివ, అమరావతి డిక్లరేషన్..

(మొదటిపేజీ తరువాయి)

తమ ప్రయత్నానికి సీఎం చంద్రబాబు అందించిన సహకారం మరువలేనిదని ఆయన పేర్కొన్నారు. అనంతరం క్యూబిట్ ప్రతినిధుల కృషిని అభినందించిన ముఖ్యమంత్రి, వారితో కలిసి సెల్ఫీ దిగి ఉత్సాహపరిచారు.




### అమరావతి డిక్లరేషన్.. డీప్‌టెక్‌కు ఊతం

ఈ సదస్సులో ఏపీ ప్రభుత్వం, పాన్ ఐఐటీ అలుమ్ని ప్రతినిధులు సంతకాలు చేసిన 'అమరావతి డిక్లరేషన్' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీని ప్రకారం, అమ రావతిలో ఏపీ ప్రభుత్వం-పాన్ ఐఐటీ అలుమ్ని ఇండియా ఆధ్వర్యంలో ఒక శాశ్వత కౌన్సిల్ ఏర్పాటు కానుంది. డీప్‌టెక్ స్టార్టప్‌లు, ఆవిష్కరణలు, పెట్టుబడులను ప్రోత్సహించేందుకు రూ.500 కోట్ల పాన్ ఐఐటీ అమరావతి వెంచర్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ కౌన్సిల్ ద్వారా రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలు, స్టార్టప్‌లను సమన్వయం చేస్తారు. రాష్ట్రంలోని విద్యా సంస్థల్లో 10 ఇండస్ట్రీ చైర్స్ ఏర్పాటు చేయడం, 100 మంది గ్లోబల్ ఐఐటీ మెంటర్లతో స్టార్టప్‌లకు మార్గ నిర్దేశం చేయడం, 23 ఐఐటీల నుంచి టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ వంటివి ఈ డిక్లరేషన్‌లోని ముఖ్యాంశాలు. క్వాంటమ్-ఏఐ, సెమీకండక్టర్లు, స్పేస్-డిఫెన్స్ వంటి రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించి, 2030 నాటికి కనీసం 50 స్టార్టప్‌లను ఇంక్యుబేట్ చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించారు.

### క్వాంటం వ్యాలీగా అమరావతి: సీఎం చంద్రబాబు

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. "గతంలో ఐటీని ప్రోత్సహిస్తే ప్రపంచ వ్యాప్తంగా మన తెలుగువారు నిపుణులుగా ఎదిగారు. ఇప్పుడిక సిలికాన్ వ్యాలీ గురించి కాదు, అమరా వతిలోని క్వాంటం వ్యాలీ గురించి ప్రపంచం చర్చించు కుంటుంది" అని ధీమా వ్యక్తం చేశారు. గతంలో తాను విజన్ 2020 తీసుకువచ్చినప్పుడు కొందరు '420' అంటూ హేళన చేశారని, కానీ దాని ద్వారానే విద్యుత్, రహదారుల వంటి రంగాల్లో సంస్కరణలు వచ్చాయని గుర్తుచేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తోందని, 2047 నాటికి భారత్ ప్రపంచంలోనే అగ్రగామి ఆర్థిక వ్యవస్థగా ఎదగడాన్ని ఎవరూ ఆపలేరని అన్నారు. జాతి నిర్మాణంలో భాగమైన ఐఐటీయన్లు వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఐబీఎం-టీసీఎస్, ఎల్ అండ్ టీ సంయుక్తంగా ఏర్పాటు చేయనున్న క్వాంటం కంప్యూటర్ ఆపరేషన్స్ వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి అమరావతి నుంచే ప్రారంభమవుతాయని చంద్రబాబు ప్రకటించారు. భవిష్యత్తులో కేవలం వినియోగించు కోవడమే కాకుండా, క్వాంటం కంప్యూటర్లను తయారు చేసి ఎగుమతి చేసే స్థాయికి ఆంధ్రప్రదేశ్ చేరుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.




## పిల్లల ఆన్‌లైన్ భద్రతకు

# ప్రత్యేక ఫ్రేమ్‌వర్క్

**- ఆన్‌లైన్‌లో పిల్లల సేఫ్టీ.. అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు**

**- మహిళలు, పిల్లల రక్షణే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని వెల్లడి**

**- సైబర్ క్రైమ్‌కు 1930, చైల్డ్ హెల్ప్‌లైన్‌కు 1098 నంబర్లు గుర్తుంచుకోవాలని సూచన**

హైదరాబాద్ - సూర్య వాస్తవం

డిజిటల్ యుగంలో సైబర్ నేరాల నుంచి పిల్లలకు రక్షణ కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక చర్యలకు శ్రీకారం చుట్టింది. పిల్లల ఆన్‌లైన్ భద్రత కోసం ఒక సమగ్ర ఫ్రేమ్‌వర్క్‌ను వెంటనే రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా) సౌత్ జోన్ రీజనల్ కాన్ఫరెన్స్‌లో ఆయన ఈ ఆదేశాలు జారీ చేశారు. ఆన్‌లైన్‌లో పిల్లలు ఎక్కువ సమయం గడుపుతున్నారని, అక్కడ ఎదురయ్యే ప్రమాదాలపై వారికి సరైన అవగాహన ఉండటం లేదని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, తెలంగాణ హైకోర్టు, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థతో సంప్రదింపులు జరిపి ఈ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించాలని సూచించారు. మహిళలు, పిల్లల సంరక్షణే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ ఫ్రేమ్‌వర్క్ ద్వారా న్యాయ సేవలను రాష్ట్రంలోని ప్రతీ గ్రామానికి విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు సీఎం కీలక సూచనలు చేశారు. పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలను గమనించేటప్పుడు తీర్పులిచ్చేలా కాకుండా ఆసక్తిగా, స్నేహపూర్వకంగా వ్యవహరించాలని అన్నారు. "క్యూరియస్‌గా ఉండండి, జడ్జిమెంటల్‌గా కాదు" అని ఆయన హితవు పలికారు. సైబర్ క్రైమ్ ఫిర్యాదుల కోసం 1930, చైల్డ్ హెల్ప్‌లైన్ కోసం 1098 నంబర్లను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఇప్పటికే భరోసా సెంటర్లు, దేశంలోనే మొదటి చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టు, సైబర్‌హర్ యాప్ వంటివి సమర్థంగా పనిచేస్తున్నాయని సీఎం గుర్తుచేశారు.

## కర్ణాటకలో కరువు పరిస్థితి

# పంట నష్టం అంచనా

(మొదటిపేజీ తరువాయి)

అత్యంత తీవ్రమైన కరువు పరిస్థితులను ఎదుర్కొంటోందని, దీని ఫలితంగా గణనీయమైన వర్షపాతం లోటు, విస్తృత పంట నష్టం మరియు లక్షలాది రైతు కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. అంచనా ప్రకారం రూ.18,748.23 కోట్ల నష్టం వాటిల్లిన నేపథ్యంలో, కర్ణాటక జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి కింద రూ.3,705.30 కోట్ల సహాయాన్ని కోరింది. రాష్ట్రం అభ్యర్థించిన మొత్తాన్ని తక్షణమే విడుదల చేయాలని ఆయన కేంద్రాన్ని కోరారు. కళ్యాణ కర్ణాటక ప్రాంతంలో కరువు వల్ల జరిగిన నష్టాన్ని పరిశీలించడానికి ఒక బృందాన్ని పంపాలని కూడా ఆయన కేంద్రాన్ని అభ్యర్థించారు. చిన్న, సన్నకారు రైతులకు ఇచ్చే ఇన్‌పుట్ సబ్సిడీని 2015-16 వ్యవసాయ గణన ప్రకారం కాకుండా, కర్ణాటక నవీకరించిన 'భూమి' రికార్డుల ఆధారంగా లెక్కించాలని మల్లికార్జున్ ఖర్గే డిమాండ్ చేశారు. దీనివల్ల, సహాయానికి అర్హులైన రైతులు ఆ సహాయాన్ని అందుకోకుండా మిగిలిపోకుండా ఉండవచ్చని ఆయన అన్నారు. రాష్ట్రం తొలుత కరువు పీడిత 101 తాలూకాల కోసం రూ. 3,705.30 కోట్ల సహాయాన్ని కోరింది.రాష్ట్రంలోని 217 తాలూకాలను కరువు పీడిత ప్రాంతాలుగా ప్రకటించిన నేపథ్యంలో, 12 జిల్లాల్లో మూడు బృందాలచే నాలుగు రోజుల కరువు పరిస్థితి అంచనా నిర్వహించబడుతుంది. ఈ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి డాక్టర్ జి. పరమేశ్వర, ప్రధాన కార్యదర్శి డాక్టర్ శాలిని రజనీష్, ముఖ్యమంత్రి ఆర్థిక సలహా దారు ఎల్.కె. అతీక్, వివిధ శాఖల సీనియర్ అధికారులు హాజరయ్యారు.

# మహారాష్ట్రలో స్వల్ప భూకంపం

ముంబై- సూర్య వాస్తవం



మహారాష్ట్రలోని హింగోలి, నాందేడ్ జిల్లాల్లో మరోసారి స్వల్ప భూకంప ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. శనివారం ఉదయం సుమారు 7:46 గంటలకు ఔంధా నాగ్‌నాథ్ తాలూకాలోని గధాలా ప్రాంతంలో ప్రకంపనలు నమోదయ్యాయి. రిక్టర్ స్కేల్ పై భూకంప తీవ్రత 3.3గా నమోదైనట్లు హింగోలి జిల్లా విపత్తు నిర్వహణ శాఖ వెల్లడించింది. అకస్మాత్తుగా ప్రకంపనలు రావడంతో స్థానికులు కాసేపు ఆందోళనకు గురయ్యారు. అయితే భూకంప తీవ్రత తక్కువగా ఉండటంతో ఇప్పటివరకు ఎలాంటి భారీ నష్టం జరిగినట్లు సమాచారం లేదు. పరిస్థితిని అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

# సంపాదకీయం

## కరిగిపోతున్న డాలర్ డ్రీమ్స్...




అమెరికా వెళ్లాలి.. డాలర్ డ్రీమ్స్ నెరవేర్చుకోవాలి' అని భారత్‌లోని సగటు యువతలో చాలామంది ఆశపడుతూ ఉంటారు. అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ట్రంప్ అక్కడి విదేశీ విద్యార్థులు, యువత ఆశలపై నీళ్లు చల్లడం ప్రారంభించారు. ఒకప్పుడు ఇంజినీరింగ్ పూర్తయిందంటే అమెరికాలో ఓూ.. ఆ తర్వాత అక్కడే ఉద్యోగం. ఇదే లక్ష్యంగా వేలాది మంది విద్యార్థులు భారీ మొత్తంలో డబ్బు ఖర్చు చేసేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి క్రమంగా మారుతోంది. అమెరికా వీసా నిబంధనల్లో మార్పులు, అక్కడి ఉద్యోగ మార్కెట్‌లో అనిశ్చితి, విదేశీ విద్యపై పెరుగుతున్న ఖర్చులు.. ఇవన్నీ విద్యార్థులను మరోసారి ఆలోచించేలా చేస్తున్నాయి. ఇంజినీరింగ్ విద్యార్థుల్లో కొంతకాలంగా కనిపిస్తున్న కొత్త ట్రెండ్ ఇదే. గతంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌ను ఒక ఆప్షన్‌గా మాత్రమే చూసిన విద్యార్థులు.. ఇప్పుడు దానినే మొదటి ప్రాధాన్యతగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. అమెరికాలో ఓూ కోసం లక్షల రూపాయలు ఖర్చు చేసి వెళ్లడం కంటే.. స్వదేశంలోనే ఉద్యోగం సంపాదించి రెండుమూడేళ్లు అనుభవం పొందితే ఎలా ఉంటుందనే ఆలోచన పెరుగుతోంది. ముఖ్యంగా కుటుంబంపై భారీ ఆర్థిక భారం పడకుండా ఉండటం, ఉద్యోగ భద్రత ఉండటం విద్యార్థులను క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ వైపు మళ్లిస్తోంది. ఈ మార్పు విద్యార్థుల ఆలోచనల్లోనే కాదు.. ఇంజినీరింగ్ కాలేజీల్లోనూ కనిపిస్తోంది. గతంలో చివరి ఏడాదిలో ప్లేస్‌మెంట్ కోసం సిద్ధమయ్యే విద్యార్థులు.. ఇప్పుడు రెండో సంవత్సరం నుంచే కోడింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ ప్రిపరేషన్‌పై దృష్టి పెడుతున్నారు. క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లకు ముందుగానే రిజిస్టర్ చేసుకుంటున్నారు. విదేశీ విద్యకు వెళ్లే ముందు ఉద్యోగం దొరికితే.. ఆ తర్వాత పరిస్థితులను బట్టి తదుపరి నిర్ణయం తీసుకోవచ్చని భావిస్తున్నారు. కానీ ఇక్కడా సవాళ్లు తప్పడం లేదు! విద్యార్థులు క్యాంపస్ ఉద్యోగాల వైపు మొగ్గుచూపుతున్నప్పటికీ.. రిక్రూట్‌మెంట్ మార్కెట్ మాత్రం అంత ఆశాజనకంగా కనిపించడం లేదు. గత మూడేళ్లలో అనేక కాలేజీల్లో క్యాంపస్‌కు వచ్చే కంపెనీల సంఖ్య తగ్గినట్లు విద్యాసంస్థలు చెబుతున్నాయి. ఒకప్పుడు కొన్ని కాలేజీలకు 50 నుంచి 80 వరకు కంపెనీలు వచ్చేవని, ప్రస్తుతం కొన్ని చోట్ల ఆ సంఖ్య 20 నుంచి 30కి పడిపోయిందని చెబుతున్నారు. దీంతో ఉద్యోగం కావాలనే డిమాండ్ పెరుగుతున్న సమయంలో.. ఉద్యోగ అవకాశాల సంఖ్య మాత్రం తగ్గడం విద్యార్థులకు మరో సవాలుగా మారుతోంది. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో మరో సమస్య కూడా విద్యార్థులను ఆందోళనకు గురిచేస్తోంది. కొన్ని కంపెనీలు విద్యార్థులను ఎంపిక చేసి ఆఫర్ లెటర్లు ఇచ్చినప్పటికీ.. వెంటనే ఉద్యోగంలోకి తీసుకోకుండా నెలల తరబడి జాయినింగ్‌ను వాయిదా వేస్తున్న ఘటనలు కనిపిస్తున్నాయి. దీంతో ఉద్యోగం వచ్చిందనే సంతోషం ఉన్నా.. వాస్తవంగా ఎప్పుడు పని ప్రారంభిస్తామనే అనిశ్చితి విద్యార్థులను వెంటాడుతోంది. కొన్ని ప్రముఖ విద్యాసంస్థల్లోనూ ఇలాంటి ఆలస్యాలపై కంపెనీలకు సంబంధించి చర్యలు తీసుకున్న సందర్భాలు ఉండటం ఈ సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. అయితే విద్యార్థులు పూర్తిగా అమెరికా కలను వదులుకున్నారని చెప్పలేం. విదేశాల్లో చదువుకోవాలనే ఆసక్తి ఇంకా ఉంది. కానీ 'ముందు ఉద్యోగం.. తర్వాత విదేశీ ప్రయాణం' అనే వ్యూహం మాత్రం బలపడుతోంది. ఇండియాలో రెండుమూడేళ్లు పనిచేసి అనుభవం సంపాదించిన తర్వాత అమెరికా లేదా ఇతర దేశాలకు వెళ్లాలని కొందరు విద్యార్థులు భావిస్తున్నారు. ప్రారంభంలో జీతం తక్కువగా ఉన్నా.. చేతిలో ఉద్యోగం, అనుభవం ఉండటం వల్ల భవిష్యత్ నిర్ణయాలు తీసుకోవడం సులభమవుతుందని వారు భావిస్తున్నారు. ఒకప్పుడు విదేశీ విద్య అంటే అధిక జీతం, అమెరికా ఉద్యోగం, సెటిల్‌మెంట్ అనే కల కనిపించేది. ఇప్పుడు విద్యార్థులు రిస్క్, ఖర్చు, వీసా, ఉద్యోగ భద్రత వంటి అంశాలను కూడా లెక్కలోకి తీసుకుంటున్నారు. అందుకే అమెరికా వెళ్లడమే కెరీర్ విజయానికి ఏకైక మార్గం కాదనే భావన బలపడుతోంది. స్వదేశంలోనే మొదటి ఉద్యోగం సంపాదించి.. నైపుణ్యాలు పెంచుకుని.. అనుభవంతో తర్వాత విదేశీ అవకాశాలను పరిశీలించడం కొత్త కెరీర్ వ్యూహంగా మారుతున్నట్లు కనిపిస్తోంది. హెచ్-1బీ వీసా చార్జీలు అనూహ్యంగా పెంచడమే కాక, విద్యార్థి వీసాలపై వచ్చే వారిపై కఠిన నిబంధనలు విధించారు. దీంతో అక్కడ ఉంటున్న ఇండియన్స్ సహా ఇతర దేశస్థులకు ఉద్యోగ అవకాశాలు తగ్గడమే కాక, ఆ దేశానికి వచ్చే విదేశీ విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నది. హెచ్-1బీ వీసా కింద నియామకాలు తగ్గించి స్థానికులనే నియమించుకోవడం మెల్లిగా ప్రారంభించాయి. డాలర్ల సంపాదన లక్ష్యానికి ట్రంప్ దెబ్బకొట్టడంతో అమెరికాకు వెళ్లే భారత విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. పోనీ ఎలాగోలా వెళ్దామని దరఖాస్తు చేసుకున్న వారిలో చాలామంది విద్యార్థుల వీసా దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయి. వీసాల తిరస్కరణ డాటాను పరిశీలిస్తే.. ప్రాంతాల వారీగా వాటిలో అసమానతలు పెరుగుతున్నాయన్న విషయం వెల్లడవుతున్నది. దీనివల్ల అమెరికాలో విద్యావకాశాలు యోగ్యత, ప్రతిభ కంటే భౌగోళిక పరిస్థితుల వల్లే ఎక్కువగా ప్రభావితమవుతున్నాయా? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. అమెరికా విద్యావకాశాల విషయంలో ప్రాంతీయఅంతరం పెరుగుతున్నదని ఒక నివేదిక వెల్లడించింది.

భారత దేశం సహా పాకిస్థాన్, నేపాల్, ఫిలిప్పీన్స్, కెన్యా, బ్రెజిల్, మెక్సికో, వియత్నాం, అర్జెంటీనా లాంటి గ్లోబల్ సౌత్ దేశాల నుంచి వచ్చే విద్యార్థి వీసా దరఖాస్తుదారులు, యూరప్, ఉత్తర అమెరికా నుంచి వచ్చే వారితో పోలిస్తే అధిక తిరస్కరణను ఎదుర్కొంటున్నారు. భారత స్టూడెంట్ల వీసా తిరస్కరణ ఇలా2023- 36%, 2024-53%, 2025-61% 2025 ఫిబ్రవరి నాటికి అమెరికాలో 3,78,787 మంది మన విద్యార్థులు ఉండగా, 2026 ఫిబ్రవరి నాటికి ఆ సంఖ్య 3,52,644కు తగ్గిపోయింది. మొత్తంగా చూస్తే.. అమెరికా కలకు పూర్తిగా తెరపడకపోయినా, ఇంజినీరింగ్ విద్యార్థుల ప్రాధాన్యతలు మాత్రం మారుతున్నాయి. విదేశీ విద్య కోసం భారీ రిస్క్ తీసుకోవడం కంటే.. ముందుగా క్యాంపస్ ప్లేస్‌మెంట్ ద్వారా కెరీర్‌కు బలమైన పునాది వేసుకోవడానికే కొత్త తరం ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోంది.

# భారత్ దెబ్బ... అగ్రరాజ్యం అబ్బ...




**న్యూఢిల్లీ- సూర్య వాస్తవం :** అంతరిక్షంలోనే ఉపగ్రహాలను కూల్చివేసే క్షిపణి టెక్నాలజీ కలిగిన ప్రపంచంలోని నాలుగు దేశాల్లో భారత్ ఒకటి. భారత్ 2019లో అమెరికా, చైనా, రష్యాల సరసన చేరింది. అయితే, మార్చి 2019లో చేపట్టిన ఈ ప్రయోగం అగ్రరాజ్యం అమెరికాను కలవరానికి గురి చేసింది అని ఆ దేశ మాజీ నిఘా అధికారి తాజాగా వెల్ల డించారు. ఆయన ఓ పాడ్‌కాస్ట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. భారత్ చేపట్టిన యాంటి శాటిలైట్ మిసైల్ పరీక్ష సమయంలో ఆందోళన చెందినట్టు తెలిపారు. పోఖ్రాన్-2 అణు పరీక్షలతో అమెరికాతో ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేసిన భారత్.. అణుశక్తిలో తాము ఏమాత్రం తీసిపోమని నిరూపించింది. ఇది జరిగిన దాదాపు 28 ఏళ్ల తర్వాత అగ్రరాజ్యానికి భారత్ అలాంటి సర్‌ప్రైజ్ ఇచ్చింది. మార్చి 27, 2019 భారత్ చేపట్టిన 'మిషన్ శక్తి' ( యాంటీ శాటిలైట్ క్షిపణి ప్రయోగం అమెరికా నిఘా వర్గాలను తీవ్రగ్భ్రాంతికి గురిచేసింది. దీనికి సంబంధించిన వివరాలను అమెరికా వాయుసేన మాజీ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ డేవిడ్ గ్రుష్ తాజాగా ప్రముఖ పాడ్‌కాస్టర్ జో రోగన్ ఇంటర్వ్యూలో వెల్లడించారు. అప్పట్లో నేషనల్ రీకాన్సార్స్ ఆఫీస్ ఆపరేషన్స్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న గ్రుష్.. ఆ సమయంలో జరిగిన సంఘటనలను గుర్తు చేసుకున్నారు. "ఇది ఒక విచిత్రం... 2019లో ఎవరూ ఊహించని విధంగా భారత్ నిర్వహించిన క్షిపణి పరీక్ష వారి ఉపగ్రహాలలో ఒకదానిని తాకింది.. ఈ విషయం గురించి వారు మాకు ముందు తెలియజేయలేదు" అని ఆయన అన్నారు. ఒడిశా తీరంలో భారత్ క్షిపణి పరీక్షకు సంబంధించి నోటీసు జారీ చేసినప్పటికీ.. అది ఉపగ్రహాన్ని పేల్చివేసే 'యాం' క్షిపణి అని అమెరికా ఊహించలేకపోయింది. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జాతిని ఉద్దేశించి ప్రసంగించే వరకు దీనిపై ఎవరికీ అవగాహన లేదు. ఈ ప్రయోగం వల్ల ఏర్పడిన అంతరిక్ష వ్యర్థాల నుంచి తమ నిఘా ఉపగ్రహాలకు ప్రమాదం పొంచి ఉందేమోనని ఎన్ఆర్వో అధికారులు తీవ్ర ఆందోళన చెందారని ఆయన అన్నారు. వెంటనే వ్యర్థాల విస్తరణను లెక్కించి, అమెరికా ఉపగ్రహాల మార్గాన్ని మార్చాల్సిన అవసరం ఉందో లేదో చూడాలని విశ్లేషకులను ఆదేశించినట్లు గ్రుష్ తెలిపారు. ప్రయోగంలో భాగంగా భారత్ తన ఉపగ్రహం 'మైక్రోశాట్-ఆర్' ను నింగిలోనే విజయవంతంగా కూల్చివేసింది. దీంతో అంతరిక్షంలోనే ఉపగ్రహాలను ధ్వంసం చేసే వ్యూహాత్మక సామర్థ్యం కలిగిన అమెరికా, రష్యా, చైనాల సరసన భారత్ చేరింది. ఈ ప్రయోగం తక్కువ భూకక్ష్యలో జరిగిందని, ఏర్పడిన వ్యర్థాలు కొన్ని వారాల్లోనే నశిస్తాయని, అంతరిక్షంలో ఆయుధాల పోటీలో పాల్గొనే ఉద్దేశం భారత్‌కు లేదని విదేశాంగ శాఖ అప్పట్లోనే స్పష్టం చేసింది. భారత్ క్షిపణి ప్రయోగంపై నిఘా పెట్టేందుకు డియెగో గార్సియా బేస్ నుంచి అమెరికా వైమానిక దళ విమానం బంగాళాఖాతం మీదుగా వచ్చిందని 'ఎయిర్‌క్రాఫ్ట్ స్పాట్స్' నివేదించింది. అయితే తమ ఆస్తులేవీ భారత్‌పై గూఢచర్యం చేయలేదని అమెరికా రక్షణ శాఖ అప్పట్లో ప్రకటించినప్పటికీ.. గ్రుష్ చెప్పిన విషయాలను బట్టి ఈ ప్రయోగం అమెరికాకు పూర్తిగా ఊహించని షాక్ అని స్పష్టం చేస్తున్నాయి.

# వైసీపీ ఓటు షేరు ఎందుకు తగ్గింది....



**విజయవాడ- సూర్య వాస్తవం :** ఏపీలో స్థానిక ఎన్నికలు త్వరలో జరగబోతున్నాయి. ఈ నేపథ్యంలో ఎవరి లెక్కల్లో వారు ఉన్నారు. సీట్ల సర్దుబాటు.. ఇతర వ్యవహారాలు జోరుగా సాగుతు న్నాయి. సహజంగా కూటమిలో పోటీ అధికంగా ఉంది. వైసీపీలో పోటీ చేయడానికి ఎవరూ ముందుకు రావడంలేదని వాదనలు ఉన్నాయి. ఇలా సాగుతున్న రాజకీయ వ్యవహారంలో చాణక్య సంస్థ సర్వే నిర్వహించింది. ఈ సర్వే ప్రకారం 2024 తర్వాత 4.37 ఓట్ షేర్ ను వైసిపి కోల్పోయింది.. టిడిపి తో పోల్చితే దాదాపు 11.90 శాతం తేడా ఓటు బ్యాంకు కనిపిస్తోంది. ఎమ్మెల్యేలలో లోకేష్ టాప్ లో ఉన్నారు. 175 నియోజకవర్గాలలో 52, 500 మంది ఓటర్లను పరిశీలించారు. రెండు నెలలపాటు సర్వే నిర్వహించారు. అయితే కూటమి బలం తగ్గడం కాదు కదా.. భారీగా పెరిగింది. 2024 లో జరిగిన ఎన్నికలతో పోల్చి చూస్తే చాణక్య సర్వే చెప్పిన దాని ప్రకారం చూస్తే.. టిడిపి ఓటు బ్యాంకు 45. 60% నుంచి 46.90 శాతానికి పెరిగింది. మొత్తంగా ఓటు బ్యాంకు 1.30 శాతానికి పెరిగింది. వైసీపీకి 2024 ఎన్నికల్లో 39.37 ఓటు బ్యాంకు లభించింది. ఇప్పటికి అది 35% పడిపోయింది. జనసేనకు నాడు ఓటు బ్యాంకు 8.53 శాతం గా ఉంది. ఇప్పుడు అది తొమ్మిది శాతానికి చేరుకుంది. మొత్తంగా 0.47 ఓటు శాతం పెరిగింది. బిజెపికి 2.83 శాతం ఉండగా.. ఇప్పుడు అది 3.5 జీరోకి జరిగింది. మొత్తంగా 0.67 శాతం ఓటు బ్యాంకు పెరిగింది. ఇక ఇతరులు 3.67 నుంచి 5.60 వరకు శాతాన్ని పెంచుకున్నారు. మొత్తంగా మూడు పార్టీల ఓటు షేర్ దాదాపు 57% నుంచి 59.4 శాతానికి చేరుకుంది. అధికారులకు వచ్చిన తర్వాత ఓటు బదిలీ మరింత బలపడింది. 4.37 పాయింట్ల ఫలితమే ఈ సర్వేలో అతిపెద్ద మార్పు. ఓటు షేర్ 35% పడిపోయింది. రఫ్ఫా రఫ్ఫా నినాదాలు మాత్రమే చెబుతున్న వైసిపి నాయకులు.. ప్రజా సమస్యలను పట్టించుకోకపోవడం వల్లే ఈ సమస్య ఎదురయిందని విశ్లేషకులు అంటున్నారు. ఇప్పటికైనా పకడ్బందీగా వ్యవహరించకపోతే 35 శాతం ఓటు బ్యాంక్ కూడా తగ్గిపోతుందని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ గణాంకాలు చూస్తే వైసిపి కోల్పోవడం కష్టంగానే కనిపిస్తోంది. వైసిపి కోల్పోయిన ఓట్లలో కొంత భాగం ఇతరుల వైపు వెళ్ళింది. అటు కూటమి.. ఇటు వైసీపీ మీద అసంతృప్తితో ఉన్నవారు కాంగ్రెస్ లాంటి ప్రత్యామ్నాయాల వైపు చూస్తున్నారు. ఎమ్మెల్యేలలో లోకేష్.. కోటం.. పవన్ కళ్యాణ్ వరుసగా టాప్ మూడు స్థానాలలో ఉన్నారు. ఇక వైసిపి ఎమ్మెల్యేలలో చివరికి జగన్ తో ఎవరూ పెద్దగా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. బెంగళూరు నుంచి వచ్చిన తర్వాత మాత్రమే జగన్ పులివెందులలో హడావిడి చేస్తున్నారని.. ఆ తర్వాత జనాల బాధలను పట్టించుకునేవారు లేరని సర్వేలో తేలింది. మంత్రులుగా ఉన్నప్పటికీ పవన్ కళ్యాణ్ పిం ాపురం విషయంలో.. లోకేష్ మంగళగిరి విషయంలో మరింత దూకుడు ప్రదర్శిస్తున్నారని తెలుస్తోంది. చంద్రబాబు అయితే కుప్పం విషయంలో వారానికి రెండు రోజులు సమయం కేటాయిస్తున్నారని.. ముఖ్యమంత్రిగా ప్రతిరోజు కుప్పం వెళ్లడం సాధ్యం కాదు కాబట్టి.. ఆయన నియమించుకున్న ప్రతినిధుల ద్వారా ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నారు.. ముఖ్యమంత్రి అయిన తర్వాత కుప్పం విషయంలో చంద్రబాబు నిత్యం పర్యవేక్షణ చేస్తున్నారు. అందువల్లే ఆయన పనితీరు కూడా అద్భుతంగా ఉందని ఈ సర్వేలో తేలింది.

**రాజకీయాల్లోకి కేకే**

దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా చిత్రవిచిత్రమైన నంబర్లతో, సర్వేల పేరుతో సోషల్ మీడియాలో విపరీతమైన హంగామా సృష్టించిన కేకే సర్వేస్ అధినేత కిరణ్ కొండేటి ఇప్పుడు నేరుగా రాజకీయ రంగప్రవేశానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటివరకు తెరవెనుక కూర్చుని ఓట్ల శాతం, సీట్ల లెక్కలంటూ గాల్లో మేడలు కట్టిన ఆయన.. ఇప్పుడు నేరుగా రాజకీయ రంగంలోకి దిగుతున్నట్లు ప్రకటించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అర్హులైన ప్రజలను కుల, మత, జాతి విభేదాలు లేకుండా ప్రోత్సహించడానికే ఏకం అనే ప్లాట్‌ఫామ్‌ను తీసుకొస్తున్నామని ప్రకటించారు. పంచాయతీ, మండల పరిషత్ నుంచి మొదలుపెట్టి రానున్న రోజుల్లో అసెంబ్లీ, పార్లమెంట్ వంటి అన్ని రకాల ఎన్నికల్లోనూ ఈ వేదిక తరఫున అభ్యర్థులను నిలబెడతామంటూ విజయవాడ స్టార్ హోటల్‌లో సమావేశం ఏర్పాటు చేసి ప్రకటించారు. గతంలో ఏదో ఒక ఎన్నికల ఫలితాన్ని అంచనా వేసి లైమ్‌లైట్‌లోకి వచ్చినప్పటికీ.. ఆ తర్వాత ఆ క్రెడిబిలిటీని సోషల్ మీడియాలో, పొలిటికల్ సర్కిల్స్‌లో క్యాష్ చేసుకునేందుకు ఆయన పడ్డ పాట్లు అందరికీ తెలిసిందే. సర్వే నంబర్ల పేరుతో పక్కా సైంటిఫిక్ స్టడీలని నమ్మబలుకుతూ ఇచ్చిన లెక్కలు పలుమార్లు తలకిందులై తీవ్ర ఎదురుదెబ్బలు తగిలాయి. జూబ్లీహిల్స్ ఎన్నికల ఫలితంతోనే ఆయన మరో ఆరా మస్తాన్ అని అందరికీ క్లారిటీ వచ్చేసింది. సొంత విశ్వసనీయతపై పెద్ద ఎత్తున ప్రశ్నలు తలెత్తడంతో, ఇక సర్వేల పేరుతో విశ్లేషణలు చెబితే ప్రజలు పట్టించుకునే స్థితిలో లేరనే వాస్తవాన్ని గుర్తించే.. ఈసారి డైరెక్ట్‌గా తానే ఒక పార్టీ లేదా రాజకీయ వేదికను తెరపైకి తెస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలంటే గ్రామస్థాయిలో గ్రూపు తగాదాలు, భారీ ఆర్థిక వనరులు, బలమైన కేడర్‌తో ముడిపడి ఉండే వ్యవహారం. అలాంటి చోట కేవలం ఏకం అనే ఒక వేదికను సృష్టించి, ఆసక్తి ఉన్న వారికి టికెట్లు ఇస్తామంటే గ్రామాల్లో ఓట్లు రాలతాయా అన్నది కనీస ప్రశ్న. సర్వేల పేరిట ప్రశంసలు, విమర్శలు పొందినంత తేలికగా క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని నడపడం, ఎన్నికల ఖర్చులను భరించి నెగ్గుకురావడం సాధ్యం కాదన్నది బహిరంగ సత్యం. ఎంతకాలమని సర్వేల సోది చెబుతూ ప్రజలను మభ్యపెడతాం.. మనమే ఓ ప్లాట్‌ఫామ్ పెట్టి రాజకీయం నడిపిస్తే పోలా అన్న ఆలోచన నుంచే ఈ ఏకం పుట్టుకొచ్చిందని అర్థం చేసుకోవచ్చు. సర్వేల విశ్వసనీయత కోల్పోయిన తర్వాత రాజకీయంగా ఉనికిని చాటుకోవడానికి వేసిన ఈ కొత్త ఎత్తుగడ ఏ మేరకు నిలబడుతుందో చూడాలి.

# బీసీలకు చంద్రబాబు ద్రోహం: కె.వి.రమణ

### - స్థానిక సంస్థల రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పు నేపథ్యంలో ప్రభుత్వంపై విమర్శలు



**అనంతపురం -సూర్య వాస్తవం :** స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోలను హైకోర్టు కొట్టివేసిన నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసీపీ రాయలసీమ జోనల్ అధికార ప్రతినిధి కె.వి. రమణ తీవ్ర విమర్శలు చేశారు. బీసీలకు రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం మోసపూరితంగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోలు న్యాయ స్థానంలో నిలబడవని తాము ముందుగానే చెప్పామని రమణ పేర్కొన్నారు. డెడికేషన్ కమిషన్‌కు సంబంధించిన ప్రక్రియ పూర్తికాకముందే దాని పేరుతో ప్రభుత్వం జీవోలు జారీ చేసిందని ఆయన ఆరోపించారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బీసీలకు అధిక ప్రాతినిధ్యం కల్పిం చిందని, బీసీలపై ప్రభుత్వానికి నిజమైన చిత్తశుద్ధి ఉంటే అదే తరహాలో అధిక సంఖ్యలో స్థానాలు కేటాయించాలని రమణ డిమాండ్ చేశారు. అలాగే ఓటర్ల జాబితాలో భారీగా ఓట్లు తొలగించారంటూ రమణ చేసిన ఆరోపణలపై ఎన్నికల సంఘం స్పష్టత ఇవ్వాలని కోరారు. నిజమైన ఓటర్లకు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం లేకుండా ఎన్నికలు నిర్వహించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన వ్యాఖ్యానించారు. కేంద్రంలో భాగస్వామ్యంగా ఉన్న సమయం లో బీసీల రిజర్వేషన్ల కోసం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చంద్రబాబును బీసీ వర్గాలు ప్రశ్నించాలని రమణ పిలుపు నిచ్చారు. బీసీల సమస్యలపై ప్రజల్లో విస్తృత చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు.

# సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ

### - గ్రామాల అభివృద్ధే మా ధ్యేయం: గుమ్మనూరు ఈశ్వర్







**పామిడి - సూర్య వాస్తవం :** రాష్ట్ర కూటమి ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి,మౌలిక వసతుల కల్పన కోసం చేపట్టిన "పల్లె పండుగ (3.0)" వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా గుంతకల్లు నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం తనయుడు టిడిపి గుత్తి పామిడి ఇంచార్జ్ గుమ్మనూరుఈశ్వర్ పామిడి మండల కాలపురం గ్రామం నందు నిర్వహించిన పల్లె పండుగ 3.0, విబి -జి -రామ్ జి కార్యక్రమం కింద 10లక్షల రూపాయలతో నూతన సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా గుమ్మనూరు ఈశ్వర్ గ్రామ సందర్శన సందర్భంగా ప్రజలు, రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో తాగునీరు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు బొల్లు శ్రీనివాసరెడ్డి జింకలసంజీవ నల్లప్ప నారాయణస్వామి నాగార్జున మురళి రమణ మల్లికార్జునయాదవ్ రామాంజనేయులునాయక్ రాజు పూజారిలక్ష్మీదేవి పోతులనరేష్ మరియు జనసేన తదితర కూటమి నాయకులు, పంచాయతీ కార్యదర్శులు, మాజీ సర్పంచ్‌లు ఎంపీటీసీలు, గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కౌకుంట్లలో టీడీపీ విస్తృతస్థాయి సమావేశం...!

**- స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలకు దిశానిర్దేశం చేసిన ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్**



**ఉరవకొండ - సూర్య వాస్తవం :** ఉరవకొండ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమా వేశం కౌకుంట్ల గ్రామంలోనిర్వహించారు. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. నియోజకవర్గ వ్యాప్తంగా కూటమి అభ్యర్థుల విజయానికి సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, అనంతపురం జిల్లా పార్టీ అధ్యక్షులు పులా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## బొమ్మేపర్తి దత్త మందిరంలో మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

**- సచ్చిదానంద స్వామి ఆశీర్వాదం తీసుకున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి**



**అనంతపురం ప్రత్యేక ప్రతినిధి - సూర్య వాస్తవం :** బొమ్మేపర్తి గ్రామంలోని దత్త మందిరాన్ని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా దత్త మందిరంలో సచ్చిదానంద స్వామివారిని కలసి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారిని దర్శించుకు న్నారు. ఆలయానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యేకు ఆలయ నిర్వాహకులు, భక్తులు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ విశేషాలను నిర్వాహకులు ఆయనకు వివరించారు. కొద్దిసేపు ఆలయ ప్రాంగణంలో గడిపిన తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి భక్తులతో మాట్లాడారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

## గుంతకల్లు నూతన డీఎస్పీగా వి.శ్రీనివాసరావు

**- ఎస్పీ జగదీష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన డీఎస్పీ శ్రీనివాసరావు**

**- ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని ఎస్పీ సూచన**



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** గుంతకల్లు నూతన డీఎస్పీగా వి. శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ పి. జగదీష్ ను ఆయన ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకి పూల మొక్కను అందజేశారు. ఇటీవల బదిలీపై గుంతకల్లు డీఎస్పీగా నియమితులైన శ్రీనివాసరావు, డివిజన్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ప్రజలకు నిరంతరం అందు బాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ జగదీష్ సూచించారు. నేరాల నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టడంతో పాటు, డివిజన్‌లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిఘాను మరింత పటిష్ఠం చేయాలని ఆదేశించారు.

# శభాష్ సురేంద్ర....

- కదులుతున్న రైలు ఎక్కే క్రమంలో పట్టు జారిన ప్రయాణికుడు
- సమయస్ఫూర్తితో ప్రయాణికుడి ప్రాణాలు కాపాడిన సురేంద్ర
- అనంతపురం రైల్వే స్టేషన్‌లో... తప్పిన పెను ప్రమాదం...!
- ధైర్యసాహసాలు ప్రదర్శించిన సురేంద్రకు ఎస్పీ పి.జగదీష్ చేతుల మీదుగా సన్మానం



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** అనంతపురం రైల్వేస్టేషన్‌లో కదులుతున్న రైలును ఎక్కేందుకు ప్రయత్నించి ప్రమాదవశాత్తు రైలు నుంచి వేలాడుతున్న ఓ ప్రయాణికుడిని సమయస్ఫూర్తితో కాపాడిన అనంతపురం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ సి.సురేంద్ర (పి సి - 1550)ను జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. గత నెల 29న ఉదయం సుమారు 9 గంటల సమయంలో తిరుపతి జిల్లా వెంకటగిరిలో బందోబస్తు విధులకు వెళ్తున్న ట్రాఫిక్ ఎస్ఐ రామాంజులరెడ్డిని రైలు ఎక్కించేందుకు కానిస్టేబుల్ సురేంద్ర, హెడ్ కానిస్టేబుల్ వెంకటరమణ అనంతపురం రైల్వే స్టేషన్‌కు వెళ్లారు. ఎస్ఐని రైలు ఎక్కించిన అనంతరం ప్లాట్‌ఫామ్ నంబర్-4పై నడుచుకుంటూ వస్తుండగా భైరవనగర్‌కు చెందిన రవికుమార్ (49) కదులుతున్న రైలును ఎక్కేందుకు ప్రయ త్నించాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు పట్టు జారి, ఒక చేతితో రైలు హ్యాండిల్‌ను పట్టుకుని ప్రమాదకరంగా వేలాడుతున్న రవికుమార్‌ను కానిస్టేబుల్ సురేంద్ర గమనించారు. వెంటనే స్పందించిన ఆయన రైలు వెంట పరుగెత్తి, ప్రయాణికుడిని అప్రమత్తం చేస్తూ అతడి షర్ట్ కాలర్‌ను పట్టుకుని ప్లాట్‌ఫామ్‌పైకి లాగారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పి రవికుమార్ సురక్షితంగా బయటపడ్డాడు. తన ప్రాణాలను కాపాడిన సురేంద్రకు రవికుమార్ కృతజ్ఞతలు తెలి పారు. ఈ ఘటనను చూసిన ప్రయాణికులు, రైల్వే సిబ్బంది సైతం కానిస్టేబుల్ ధైర్యసాహసాలను అభినందించారు.



**ఎస్పీ చేతుల మీదుగా సన్మానం:**

ట్రాఫిక్ కానిస్టేబుల్ సురేంద్ర చూపిన ధైర్యం, సమయస్ఫూర్తి గురించి తెలుసుకున్న జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆయనను జిల్లా పోలీస్ కార్యాలయానికి పిలిపించి ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల ప్రాణాలను రక్షించడం పోలీసుల ప్రాథమిక బాధ్యత అని, సురేంద్ర చూపిన చొరవ పోలీస్ శాఖకు గర్వకారణమని ఎస్పీ పేర్కొన్నారు. అనంతరం జిల్లా పోలీస్ యంత్రాంగం తరఫున శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ వెంకటేష్ నాయక్, ఆర్ఐ పవన్‌కుమార్, ట్రాఫిక్ ఎస్ఐ రాంభూపాల్, పోలీసు అధికారుల సంఘం అడహాక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, సూర్యకుమార్, గాండ్ల హరినాథ్, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల కమిషన్ నిర్ణయాలు పారదర్శకంగా ఉండాలి

- చట్టాలను గౌరవించని సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి
- బాకే హాబిబుల్లా, అడ్వకేట్



**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** ఎన్నికల కమిషన్ ఒక వ్యక్తి ఆధారిత సంస్థ కాదని, ముగ్గురు సభ్యులతో కూడిన స్వతంత్ర రాజ్యాంగ సంస్థగా వ్యవస్థాగతంగా పనిచేయాల్సి ఉందని వైసీపీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు, అడ్వకేట్ బాకే హాబిబుల్లా పేర్కొన్నారు. కీలక నిర్ణయాలు రాజ్యాంగబద్ధంగా, పారదర్శకంగా, సభ్యుల మెజారిటీ నిర్ణయంతో జరగాలని ఆయన అన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో, కొత్త ఓటర్ల నమోదు విషయంలో తీసుకున్న కొన్ని నిర్ణయాలు ఏకపక్షంగా ఉన్నాయని హాబిబుల్లా ఆరోపించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకత లోపించిందని, దీనివల్ల ప్రజల్లో తమ ఓటు హక్కుపై అనుమానాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. ఎన్నికల కమిషన్‌లోని ఇతర కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి అభ్యంతరాలను సైతం పరిగణనలోకి తీసుకోకుండా నిర్ణయాలు తీసుకున్నారనే ఆరోపణలపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో సామాన్యులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నిబంధనలు, విధానాలను సరళీకరించాలని కోరారు. ఫామ్-6 ద్వారా కొత్త ఓటర్ల నమోదుకు విధించిన కొన్ని కఠిన నిబంధనలను అనంతరం తొలగించడం ఎన్నికల కమిషన్ నిర్ణయాలపై ప్రశ్నలు తలెత్తేలా చేసిందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ విశ్వసనీయత వ్యక్తులపై కాకుండా రాజ్యాంగ బద్ధమైన వ్యవస్థ, పారదర్శకత, ప్రజల విశ్వాసంపై ఆధారపడి ఉంటుందని హాబిబుల్లా అన్నారు. సీఈసీ గ్యానేష్ కుమార్ తీసుకున్న నిర్ణయాలు ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని ఆరోపిస్తూ, ఆయన తక్షణమే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి, అలాగే 2024 ఎన్నికలకు సంబంధించిన పెండింగ్ పిటిషన్లను సుప్రీంకోర్టు వేగంగా విచారించి ప్రజాస్వామ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని తన వ్యక్తిగత అభిప్రాయంగా కోరుతున్నట్లు హాబిబుల్లా తెలిపారు.

# ఘనంగా 'వికసిత్ భారత్' చిత్రలేఖన పోటీలు

- ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా సేవా సంకల్ప అభియాన్
- తైక్వాండో గోల్డ్ మెడలిస్ట్ మనోజ్‌కు తహశీల్దార్ షర్మిల చేతుల మీదుగా ఘన సన్మానం



**పామిడి -సూర్య వాస్తవం:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకుని పామిడి బిజెపి మండల అధ్యక్షులు చౌహాన్ అంజినాయక్ ఆధ్వర్యంలో స్థానిక టి.సి. ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో శనివారం 'సేవా సంకల్ప అభియాన్' కార్యక్రమం ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా దేశవ్యాప్త పిలుపు మేరకు "25 కోట్ల చిన్నారుల కలల చిత్రలేఖన - వికసిత్ భారత్" పోటీలను నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ్ కుమార్ పర్యవేక్షణలో జరిగిన ఈ చిత్రలేఖన పోటీల్లో సుమారు 80 మంది విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటారు. ఈ కార్యక్రమానికి మండల తాసిల్దార్ షర్మిల ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ చిన్నారుల ఆలోచనలకు రూపం ఇచ్చేం దుకు ఇటువంటి పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయ న్నారు. అనంతరం పోటీలలో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా మెమొంటోలు (జ్ఞాపికలు) అందజేశారు. ఇదే వేదికపై, జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ తైక్వాండో పోటీలలో గోల్డ్ మెడల్ (స్వర్ణ పతకం) సాధించి పామిడి పేరు నిలబెట్టిన విద్యార్థి రాచేపల్లి మనోజ్ ను బిజెపి నాయకులు, అధికారులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మనోజ్ ను ఇంతటి విజేతగా తీర్చిదిద్దిన తైక్వాండో మాస్టర్ తలారి తులసి రామ్‌ను అధికారులు బిజెపి నాయకులు ప్రత్యేకంగా అభినందించి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి ఎం.కె. కుమారస్వామి, మండల ఉపాధ్యక్షులు సుందరయ్య, మల్లికార్జున చారి, హాస్పిటల్ అభివృద్ధి కమిటీ మెంబర్ పూజాలక్ష్మి దేవి ఓబీసీ ఉపాధ్యక్షులు మనోజ్ కుమార్ నరేష్ యాదవ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# చెక్‌డ్యాం పూడికతీత...

- పనుల పురోగతిని పరిశీలించిన కలెక్టర్ ఓ.ఆనంద్...!
- కూలీల రోజువారీ వేతనాలు, చెల్లింపులపై ఆరా - రైతుల బీడు భూముల్లో హాఫ్ మౌంటర్ పనులు చేసుకోవచ్చని కలెక్టర్ సూచన



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :** బుక్కరాయసముద్రం మండలం చేదుళ్ల గ్రామంలో విబిజిరాంజీ పథకం కింద చేపట్టిన చెక్‌డ్యాం డిసిల్టింగ్ (పూడికతీత) పనులను జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఐఏఎస్ శనివారం పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూలీలతో కలెక్టర్ మాట్లాడి సగటున రోజువారీ వేతనం ఎంత వస్తోంది, పని చేసిన వారికి వేతనాలు సక్రమంగా జమ అవుతున్నాయా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. కూలీల సమస్యలను కూడా తెలుసుకున్నారు. అనంతరం 125 రోజుల పని పూర్తి చేసుకున్న కూలీలు, రైతులు తమ సొంత పొలాల్లోని బీడు భూముల్లో హాఫ్ మౌంటర్ పనులు చేసు కోవచ్చని కలెక్టర్ సూచించారు. ఉపాధి హామీ పథకం ద్వారా అందుతున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

# బిడ్డల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయండి..!

- అంగన్వాడి ఉత్సవం కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ మమత



**కదిరి - సూర్య వాస్తవం :** బిడ్డల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడానికి బిడ్డల తల్లిదండ్రులతో పాటు అంగన్వాడీ సిబ్బంది కూడా కృషి చేయాలని కదిరి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కుమ్మరవాండ్లపల్లి సెక్టార్ సూపర్వైజర్ మమతా పేర్కొన్నారు. కదిరి మండలం సున్నపుగుట్ట తండాలోని అంగన్వాడీ కేంద్రం మెయిన్ సెంటర్లో శనివారం అంగన్వాడీ ఉత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సూపర్వైజర్ మమత హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాల బలోపేతానికి ఎనలేని కృషి చేస్తుందని అందువల్ల అంగన్వాడి కేంద్రాలలోని వర్కర్లు ఆయాలు తమ వంతు పిల్లలకు సేవలు అందించా లన్నారు. అదేవిధంగా అంగన్వాడి కేంద్రానికి పిల్లలు సకాలంలో వచ్చే విధంగా వారి తల్లిదండ్రులు కృషి చేయాలని సూచించారు. 02 5 సంవత్సరాల పిల్లలకు అంగన్వాడీ కేంద్రంలో ఆటపాటలతో పాటు విద్యను కూడా బోధించి అంగన్వాడీ వర్కర్లు తమ వంతు కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అనంతరం గర్భవతులు బాలింతలు లబ్ధిదారులు గ్రామస్తులకు పిల్లలకి మిఠాయిలు పంచి పెట్టడం జరిగింది. ప్రభుత్వం ద్వారా అందించే పథకాల గురించి గ్రామస్తులకు లబ్ధిదారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్ విజయ భారతి, ఏఎన్ఎం శివమ్మ, జిఎంఎస్కె అనురాధ, అంగన్ వాడి సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అప్పాజిపేటలో రాత్రివేళల్లో రాళ్ల వర్షం

- భయభ్రాంతులకు లోనవుతున్న గ్రామ ప్రజలు



**పామిడి - సూర్య వాస్తవం :** మండల పరిధిలో అప్పాజిపేట గ్రామంలో రాత్రి 7 నుండి12 గంటల వరకు ఇళ్లపై రాళ్లు పడుతుండంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి పూట ఇళ్లపై రాళ్లు పడడం గత వారం రోజులుగా వీధులలో ఇళ్లపై రాళ్లు పడుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు.

పొద్దు మునిగిందంటే ఇల్లకు తలుపులు బిగించి బయటకు రాకుండా కుప్పట్లో ప్రాణాలు పెట్టుకొని బ్రతుకుతున్నారు ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ రాత్రిపూట ఏదిక్కు నుంచి రాళ్లు వస్తున్నాయో గుర్తించలేక పోతున్నామని వాపోతున్నారు. మా గ్రామానికి శక్తియో దయ్యమో దాపరించిందంటున్నారు.పోలీసులకు ఈ విషయమై గ్రామస్తులు విన్న వించుకోగా సిఐ శివశంకర్ నాయక్ బృందంతో రాత్రివేళ పర్యవేక్షించారు. ఆయన సమక్షంలోనే వీధులలో రాళ్ల వర్షం కురిసింది అన్నారు. ప్రజలు ఆయనతో పలు అనుమానాలు వ్యక్తం చేసారు.పోలీసులు గాలించినా ఎవరూ దొరక లేదని గ్రామస్థులు తెలిపారు. ఏరోజు, ఎక్కడ రాళ్లు పడతాయోనని గ్రామస్తులు బిక్కుబిక్కు మంటూ జీవనం కలుపుతున్నామన్నారు. చంచలనాత్మకమైన ఈ విషయం ను జిల్లా పోలీసు ఉన్నతాధికారులు తక్షణ చర్యలు తీసుకొని తేల్చవలసిన ఉందని గ్రామస్తులు మండల ప్రజానీకం విజ్ఞప్తి చేస్తున్నారు.

# కల్లూరు ఉన్నత పాఠశాల వైస్ చైర్మన్‌ను సన్మానించిన ఎమ్మెల్యే బండారు శ్రావణి



**గార్లదిన్నె - సూర్య వాస్తవం :** గార్లదిన్నె మండలంలోని కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా కమిటీ ఉప చైర్మన్ ముగ్గు. మారెక్కను శనివారం ఎమ్మెల్యే బండారు శ్రావణి తన టిడిపి పార్టీ కార్యాలయంలో శాలువాతో సత్కరించడం జరిగింది. వైస్ చైర్మన్ మార్క్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంలో తనవంతు బాధ్యతగా పని చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సోమలమధు,సామల రామంజి ముగ్గు జమ్మన్న చింతా వెంకట్రాముడు ముగ్గుసుధాకర్ సాయి.గణేష్.తరుణ్ భాష ఎల్ఐసి అది శివుడు కృష్ణ ఆరవ వంశి తదితరులు పాల్గొన్నారు.

## పల్లె పండుగ 3.0లో భాగంగా

# బండమీదపల్లిలో షెడ్ల నిర్మాణానికి భూమిపూజ

- ఒకటి, రెండు నెలల్లో పనులు పూర్తి చేయాలి: కలెక్టర్ ఓ. ఆనంద్
- సింగనమల మండలానికి వీబి -జీ రామ్ జీ కింద రూ.3 కోట్ల నిధులు: ఎమ్మెల్యే శ్రావణిశ్రీ
- తాగునీరు, కాంపౌండ్ వాల్స్ సమస్యలపై కలెక్టర్‌కు గ్రామస్థుల వినతి




**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :** సింగనమల మండలంలోని బండమీదపల్లి గ్రామంలో పల్లె పండుగ 3.0 కార్యక్రమం కింద పశువుల షెడ్ల నిర్మాణానికి శనివారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, అసిస్టెంట్ కలెక్టర్ సుయాశ్ కుమార్, డ్వామా పీడీ సలీం భాష తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఓ. ఆనంద్ మాట్లాడుతూ పశువులు ఉన్న రైతులు షెడ్లు నిర్మించు కోవడం ద్వారా పశువులకు రక్షణ కల్పించడంతో పాటు వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని పెంచుకునే అవకాశం ఉంటుందన్నారు. చేపట్టిన పనులను ఒకటి నుంచి రెండు నెలల్లోపు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మాట్లాడుతూ సింగనమల మండలానికి విబి-జీ రామ్- జీ కింద సుమారు రూ.3 కోట్ల నిధులు మంజూర య్యాయని తెలిపారు. పశువుల షెడ్ల నిర్మాణం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.కార్యక్రమం సందర్భంగా గ్రామస్థులు తాగునీరు, పాఠశాలలకు కాంపౌండ్ వాల్స్ తదితర సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, ఏపీడీ, ఎంపీడీఓ, వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఉరవకొండ అభివృద్ధికి 'వేగం'.. యువత భవిష్యత్తుకు 'భరోసా'

- ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే లక్ష్యం.. జల్ జీవన్ మిషన్‌పై ప్రత్యేక దృష్టి
- కౌకుంట్లలో విస్తృతస్థాయి సమావేశం.. అభివృద్ధి, ప్రజా సమస్యలపై చర్చ
- ప్రజా సంక్షేమం, నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి సమష్టిగా ముందుకు సాగాలి
- ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



**ఉరవకొండ - సూర్య వాస్తవం :** ఉరవకొండ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. ఉరవకొండ నియోజకవర్గం కౌకుంట్ల గ్రామంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో ఎంపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలనే లక్ష్యంతో జల్ జీవన్ మిషన్ ద్వారా చర్యలు చేపడుతున్నట్లు ఎంపీ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకం వేజీ రామ్ జీ కింద 223 అభివృద్ధి పనులకు సుమారు రూ.13 కోట్ల మేర అనుమతులు తీసుకున్నామని, సిమెంట్, గ్రావెల్, బీటీ రోడ్ల నిర్మాణానికి చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు.ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. గాలి విద్యుత్, సోలార్ విద్యుత్ రంగాల్లో ప్రముఖ సంస్థలతో చర్చించి సుమారు 3,500 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు కృషి చేశామని తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరిగే అవకాశం ఉందన్నారు.రాబోయే 100 రోజుల్లో ఇరిగేషన్ కాలువల విస్తరణకు చర్యలు చేపట్టి జిల్లాకు మరింత సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని ఎంపీ పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగు పరిచేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం చేస్తున్న కృషికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. మదనపల్లిలో గ్లోబల్ హార్టికల్చర్ సంస్థ ఏర్పాటుతో రాయలసీమలో ఉద్యానవన రంగానికి మరింత ప్రోత్సాహం కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజా సంక్షేమం, ఉరవకొండ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాల కల్పన కోసం నాయకులు, కార్యకర్తలు సమష్టిగా ముందుకు సాగాలని ఎంపీ కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు పూల నాగరాజు, జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, జిల్లా ఎన్నికల ఇన్‌చార్జి ఏరాస ప్రతాప్ రెడ్డి, స్థానిక నాయకులు, మాజీ ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పేదలు వేసుకున్న గుడిసెలకు మౌలిక వసతులు కల్పించాలి

- టిడిపి ఇంచార్జ్ ఈశ్వర్‌కి అర్జీ ఇచ్చిన సిపిఎం నాయకులు



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో గుత్తి పట్టణం నందు సర్వేనెంబర్ 327 నందు పేదలు వేసు కున్న గుడిసెలకు విద్యుత్ సదుపాయం,తాగునీటి సదుపాయం కల్పించి అక్కడ ఉన్న సమస్యలు పరిష్కరించాలని గుత్తి టిడిపి ఇన్చార్జ్ ఈశ్వర్ ని వారి నివాసం ఆలూరు నం దు కలిసి అక్కడ రెండు సం వత్సరాల నుంచి గుడిసెలు వేసుకొని జీవసం కొనసాగి స్తున్న ప్రజలు సిపిఎం పార్టీ నాయకులు గుంతకల్ ని యోజకవర్గం ఎమ్మెల్యే కుమారుడు ఈశ్వర్ ని కోరడం జరిగింది.ఈ సం దర్భంగా ఆయన అందరితో మాట్లాడి సమస్యలు పరి ష్కారానికి కృషి చేస్తానని చెప్పడం జరిగింది.ఇక్కడ రెండు సంవత్సరాల నుంచి గుడిసెలు వేసుకుని జీవనం కొనసాగిస్తున్న వారందరూ వారి సమస్యలను గుత్తి టిడిపి ఇంచార్జ్ ఈశ్వర్ కి విన్నపించుకోవడం జరి గింది.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి నిర్మల మండల కమిటీ స భ్యులు రేణుకమ్మ, మల్లికా ర్జున,రమేష్,నారాయణ స్వామి,చందు,గంగాధర్, నరసింహుడు, చిన్న మారెన్న, రాము, వన్నూరమ్మ, రెడ్డమ్మ, రామేశ్వరమ్మ, ముని, మల్లిక, బావమ్మ, జయరాం, నారాయణ, శిక్షావలి తదితరులు పాల్గొన్నారు.

# ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ ప్రారంభం

- బాల్య వివాహాల నివారణతో పాటు భార్యాభర్తల కుటుంబ సమస్యల పరిష్కారమే లక్ష్యం- అర్బన్ సిఐ దేవానంద్

**రాయదుర్గం - సూర్య వాస్తవం :** కుటుంబ సమస్యల కారణంగా భార్యాభర్తలు విడిపోకుండా, పరస్పరం అవగాహనతో కలిసి సుఖసంతోషాలతో జీవించేలా కౌన్సిలింగ్ అందించేందుకు రాయదుర్గంలో ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. అనంతపురం జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు రాయదుర్గం అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం ఈ ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్‌ను ప్రారం భించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల నివారణ, కుటుంబ కలహాలు, భార్యాభర్తల మధ్య తలెత్తే సమస్యలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా రాయదుర్గం అర్బన్ సీఐ దేవానంద్ మాట్లాడుతూ.. భార్యాభర్తల మధ్య చిన్నచిన్న సమస్యలు పెద్దవిగా మారి కుటుంబాలు విచ్ఛిన్నం కాకుండా కౌన్సిలింగ్ ద్వారా సమస్యలను పరిష్కరించేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుందని తెలిపారు. చావు, పుట్టుక ఎలా అయితే ఒక్కసారే జరుగుతాయో.. పెళ్లి కూడా ఒక్కసారే జరుగుతుందని, భార్యాభర్తలు ఒకరినొకరు అర్థం చేసుకుని జీవితాంతం కలిసి సుఖసంతోషాలతో జీవించాలని సీఐ దేవానంద్ సూచించారు. అలాగే బాల్య వివాహాలు చట్టవిరుద్ధమని, వాటిని అరికట్టేందుకు ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బాల్య వివాహాలు లేదా కుటుంబ సమస్యలు ఎదురైనప్పుడు పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ కమిటీ సభ్యులు, పోలీసు సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## సేవా సంకల్ప్ అభియాన్ -- జోన్ 6
## సమన్వయ సమావేశంలో పాల్గొన్న మంత్రి సత్య కుమార్



**దొరవారిసత్రం– సూర్య వాస్తవం:** సేవా సంకల్ప్ అభియాన్,సేవా జ్యోతి యాత్రపై జోన్--6 సమన్వయ వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు. కార్యక్రమాల పురోగతి, క్షేత్రస్థాయి అమలుపై కన్వీనర్లు, కో–కన్వీనర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమి ళనాడు, కేరళ, పుదుచ్చేరి, అండమాన్ అండ్ నికోబార్ దీవులు, లక్షద్వీప్ ప్రాంతాలకు చెందిన కన్వీనర్లు, కో–కన్వీనర్లతో సమన్వ యంపై చర్చించారు. కార్యక్రమాలను విజయవంతంగా నిర్వ హించేందుకు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు.

## అథ్లెటిక్స్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైన 'కేజీబివి' విద్యార్థిని హేమ



**దొరవారిసత్రం – సూర్య వాస్తవం:** దొరవారిసత్రం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఎన్.హేమ అథ్లెటిక్స్ 5 కి.మీ పరుగు పందెంలో ప్రథమ స్థానాన్ని సాధించి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ విభాగంలో పోటీ చేసేందుకు అర్హత సాధించిందని ప్రిన్సి పాల్ పార్వతి శనివారం తెలిపారు. నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17, జిల్లాస్థాయి పరుగు పందెం పోటీలు పాల్గొనడం జరిగింది.పిఈటి లలిత పరుగు పందెంలో పాల్గొనేందుకు మెలకువలతో కూడిన శిక్షణ ఇవ్వడంతో విద్యార్థిని లక్ష్యాన్ని సాధించి రాష్ట్రస్థాయిలో జరిగే క్రీడల పోటీల్లో స్థానం పొందినందుకు కేజీబీవీ ప్రిన్సిపాల్ పార్వతి,కళాశాల సిబ్బంది విద్యార్థిని హేమను అభినందిస్తూ, జాతీయస్థాయిలో పాల్గొనేందుకు అర్హత సాధించేందుకు ప్రయత్నించాలని విద్యార్థినికి సూచనలు చేశారు.

## వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన




**దొరవారిసత్రం –సూర్య వాస్తవం:** మండల పరిధిలోని నేలపట్టు గిరిజన కాలనీలో ఉన్న ఎంపీయుపి స్కూల్లో శనివారం వన్యప్రాణుల వారోత్సవాల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు మరియు ఎఫ్ఎస్ ఓ బాలయ్య పాల్గొని విద్యార్థులకు అడవులు గురించి పర్యావరణం గురించి వన్యప్రాణులు గురించి, నేలపట్టు పక్షుల కేంద్రం విశిష్టతను గురించి అవగాహన కలిగించారు. అనంతరం విద్యార్థులు ఫారెస్ట్ సిబ్బంది కలిసి ర్యాలీ నిర్వహించారు,ఈ ర్యాలీలో వన్యప్రాణుల సంరక్షణ పై నినాదాలు ఇస్తూ అడవుల సంరక్షణపై వన్యప్రాణుల సంరక్షణ పై విద్యార్థులతో పాటు ర్యాలీలో గ్రామ స్తులకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, కాకి శ్రీదేవి ఫారెస్ట్ సిబ్బంది గైడ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతున్న యువతికి రూ.లక్ష 50 వేల ఆర్థిక సహాయం
### -ముస్లిం ప్రజా హక్కుల పోరాట సమితి



**గుంతకల్ – సూర్య వాస్తవం :** ప్రమాదంలో గాయపడి కర్నూలులో చికిత్స పొందుతున్న జోహా అనే యువతి వైద్యం కోసం కేవలం ముస్లిం ప్రజా హక్కుల పోరాట సమితి అనే వాట్స్ అప్ గ్రూప్ ద్వారా రూ1,50,000ల ఆర్థిక సాయం అందించారు. ఈ డబ్బు యువతి తల్లిదండ్రులకు శనివారం వారి ఇంటి వద్ద దాతల సమక్షంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో లాయర్ ఆరిఫ్, గుజరీ మహమ్మద్ ఖాజా, వలి బాషా, మౌలా రహం తుల్లా,గఫార్ ఖాన్, ఏరూరు భాష, ఆటో ఖాజా,జాఫర్, రసూల్, మస్తాన్, బాబు, పోలా అల్లబాకాష్, అశోక్, మొహిద్దిన్, వలి,శిల్పి భాష, నూర్ భాష, షాహుల్ పాల్గొన్నారు.

## ఉచిత మంచినీటి ట్యాంకర్లను ప్రారంభించిన గుమ్మ నూరు ఈశ్వర్



**గుత్తి– సూర్య వాస్తవం :** గుత్తి పట్టణ ప్రజల తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని గుత్తి మున్సిపాలిటీ కార్యాలయంలో శనివారం ఉచిత మంచినీటి ట్యాంకర్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గుంతకల్ నియోజకవర్గం శాసనస భ్యులు గుమ్మనూరు జయరాం తనయుడు యువనేత గుత్తి, పామిడి ఇన్చా ర్జ్ గుమ్మనూరు ఈశ్వర్ హా జరై ఉచిత మంచినీటి ట్యాంకర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా గుమ్మనూరు ఈశ్వర్ మా ట్లాడుతూ గుత్తి పట్టణానికి శాశ్వత తాగునీటి సమస్యను పరిష్కరించడానికి ఇటీవలే 250 కోట్ల రూపా యలతో పనులు ప్రారంభించడం జరిగిందని త్వరలోనే గుత్తికి శాశ్వతంగా నీటి తాగునీటి సమస్య లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు ఈ సందర్భంగా ప్రత్యామ్నా యంగా ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా చూసుకోవ డానికి ఈరోజు ఉచిత మంచినీటి ట్యాంకర్లను ప్రారంభించడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో గుత్తి పట్టణ మండల కూటమి నాయకులు కార్యకర్తలు మున్సిపల్ కార్యాలయ సిబ్బంది ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కరవు మండలాల ప్రకటనపై... రైతుల ఆవేదన...!

- సాంకేతిక లెక్కలతో కరవు వాస్తవాలను విస్మరించారా..?
- 28 మండలాలకే కరవు పరిమితం..
- రాయదుర్గం, పెద్దవడుగూరు, పెద్దపప్పూరుకు దక్కని చోటు
- పెద్దవడుగూరులో 74 వేల ఎకరాల సాగుభూమిలో 29 వేల ఎకరాల్లోనే విత్తనం





**అనంతపురం – సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లాలో కరవు మండలాల ప్రకటన క్షేత్రస్థాయి పరిస్థితులకు దూరంగా ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం 28 మండలాలను కరవు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించినప్పటికీ, దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొంటున్న రాయదుర్గం, పెద్దవడుగూరు, పెద్దపప్పూరు మండలాలకు జాబితాలో చోటు దక్కక పోవడంతో ఆయా ప్రాంతాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఖరీఫ్‌లో కరవు నిర్ధారణకు నిర్ణయించిన సగటు వర్షపాత పరిమితి కంటే సుమారు 2.5 సెం.మీ. వర్షం అధికంగా నమోదైన సాంకేతిక కారణంతో ఈ మూడు మండలాలను మినహాయించినట్లు సమాచారం. అయితే కాగితాలపై నమోదైన వర్షపాత లెక్కలతో కాకుండా, క్షేత్రస్థాయిలో పంటల పరిస్థితిని పరిగణనలోకి తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

**పెద్దవడుగూరులో పరిస్థితి దారుణం**

పెద్దవడుగూరు మండలంలో మొత్తం 74 వేల ఎకరాల సాగుభూమి ఉండగా, ఈ ఖరీఫ్‌లో కేవలం 29 వేల ఎకరాల్లోనే విత్తనం పడినట్లు రైతులు చెబుతున్నారు. పత్తి, వేరుశనగ, కొర్ర, కంది, జొన్న తదితర పంటలు సాగు చేసినప్పటికీ వర్షాభావ పరిస్థితులతో చాలా వరకు పంటలు ఎండుముఖం పట్టాయి.ఇటీవల కురిసిన వర్షాలతో కంది పంట కొంత పచ్చబడినా, ఆశించిన స్థాయిలో దిగుబడి వచ్చే పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు. హెచ్చెల్సీ కాలువలోనూ సాగునీరు అందకపోవడంతో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారిందని పేర్కొంటున్నారు. పత్తి సాగు చేసిన రైతులకు ఎకరాకు రూ.60 వేల వరకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు.కరవు మండలాల ఎంపికలో కేవలం వర్షపాత గణాంకాలకే పరిమితం కాకుండా పంటల పరిస్థితి, సాగు విస్తీర్ణం, దిగుబడి నష్టం, సాగునీటి లభ్యత వంటి క్షేత్రస్థాయి అంశాలను పరిగణనలోకి తీసుకుని పునఃపరిశీలించాలని రైతులు కోరుతున్నారు.

# ఎమ్మెల్యే సమక్షంలో 50 కుటుంబాలు టీడీపీలోకి చేరిక



**డోన్ – సూర్య వాస్తవం :** డోన్ మండలంలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి మరో కీలక అడుగు పడింది. చనుగొండ్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దేవేంద్ర సమక్షంలో సుమారు 40 కుటుంబాలు ఇంద్రంపల్లె గ్రామానికి చెందిన 10 కుటుంబాలు వైఎస్సార్‌సీపీని వీడి మొత్తం 50 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి,నూతన సభ్యులకు పార్టీ కండువాలు కప్పి తెలుగుదేశం కుటుంబంలోకి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాయని అన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తున్న తెలుగుదేశం పార్టీ వైపు అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పార్టీ పనిచేస్తోందని రానున్న రోజుల్లో మరింత మంది టీడీపీలో చేరి పార్టీని బలోపేతం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. చేరిన కుటుంబాలు పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డా. కోలాల వెంకటరమణయ్యకు ఘన సన్మానం




**పగిడ్యాల – సూర్య వాస్తవం :** నంద్యాల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న డా.కోలాల వెంకటరమణయ్య పీజీటీ జువాలజీ, ఆదర్శ పాఠశాల స్కూల్ పగిడ్యాల మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ సన్మాన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు సుభాన్ 2 మురళీమోహన్ రెడ్డి జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ రావు శాలువా కప్పి, పుష్పమాలలు వేసి జ్ఞాపిక అందజేసి అభినందనలు తెలిపారు.డా. కోలాల వెంకటరమణయ్య విద్యార్థుల విద్యాభివృద్ధి, వ్యక్తిత్వ వికాసం మరియు విద్యా రంగానికి అందిస్తున్న సేవలను ప్రశంసిస్తూ భవిష్యత్తులోనూ మరింత ఉత్సాహంతో సేవలు కొనసాగించాలని ఆకాంక్షించారు.

**ఉపాధ్యాయ సేవలకు లభించిన గౌరవం మరింత బాధ్యతకు స్ఫూర్తి!"**

డా. కోలాల వెంకటరమణయ్య కి హృదయపూర్వక అభినందనలు తెలిపిన ఉపాధ్యాయ బృందం.ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సలీం భాష ఉపాధ్యాయులు మల్లికార్జున రెడ్డి,ఆసిఫ్ పాషా, రామ్మోహన్ రెడ్డి, ప్రకాశం,విశ్వేశ్వరయ్య మరియు శివ కృష్ణ అభినందనలు తెలియజేశారు

# మహేష్ బాబు పేరిట నమోదైన

# వరస్ట్ రికార్డులు ఏంటంటే.?

'రాజకుమారుడు' సినిమాతో తెలుగు సినిమా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన నటుడు మహేష్ బాబు...మొదటి సినిమాతోనే ప్రిన్స్ గా తనకంటూ ఒక ట్యాగ్ ను ఏర్పాటు చేసుకున్నాడు. ఆ తర్వాత చేసిన సినిమాలతో కొంతవరకు మెప్పించిన ప్పటికి తన పూర్తిస్థాయి నట పోటెన్షియాల్టిని బయటికి తీసిన సినిమా మాత్రం 'నిజం' అనే చెప్పాలి. అందులో ఒక డీసెంట్ యాక్టింగ్ లో మహేష్ బాబు నటన చూసిన చాలా మంది మహేష్ బాబు గొప్ప నటుడు తను ఎలాంటి పాత్రనైనా సరే చేయగలడు అంటూ అతని గురించి గొప్పగా మాట్లాడారు. ఇక ఈ క్రమంలోనే 'ఒక్కడు' సినిమాతో ఆయన మాస్‌లో తన ఫ్యాన్ ఫాలోయింగ్ ను విస్తరించు కున్నాడు. అలాగే తన కెరియర్ లోనే మొదటి బ్లాక్ బాస్టర్ సక్సెస్ ని సాధించాడు. పోకిరి, దూకుడు, శ్రీమంతుడు, భరత్ అనే నేను, మహర్షి లాంటి సినిమాలతో ఇండస్ట్రీ రికార్డులను క్రియేట్ చేశాడు. యావత్ తెలుగు సినిమా ప్రేక్షకులందరిని అలరించాడు. అలాంటి మహేష్ బాబు కెరియర్ లో కొన్ని వరస్ట్ రికార్డులు కూడా ఉన్నాయి. మహేష్ అభిమానులు వీటి గురించి మాట్లాడడానికి పెద్దగా ఇష్టపడరు. కానీ మహేష్ బాబు ఎవరినైతే నమ్మాడో వాళ్లే అతనికి వరస్ట్ రికార్డులను కట్టబెట్టారు. అప్పటినుంచి మహేష్ బాబు పూర్తి కథలను విని డేట్స్ ఇవ్వాలని బ్లైండ్ గా ఫిక్స్ అయ్యాడు. తమిళ్ సినిమా ఇండస్ట్రీలో తుపాకీ, కత్తి లాంటి వరుస బ్లాక్ బాస్టర్ సక్సెస్ లను అందుకున్న మురుగదాస్ డైరెక్షన్లో నటించాలని ఉంది అంటూ మహేష్ బాబు ఒక ఇంటర్వ్యూలో ఓపెన్ గా చెప్పాడు. దాంతో మురుగదాస్ సైతం మహేష్ బాబు నిర్ణయానికి కట్టుబడి 'స్పైడర్' అనే సినిమాని మహేష్ బాబుతో చేద్దామని అతనికి కథను వినిపించాడు. కథ కూడా మహేష్ బాబు ఫైనల్ చేశాడు. మొత్తానికైతే మురుగదాస్ మీద పూర్తి నమ్మకంతో సినిమా ఎలా వస్తుంది ఏంటి అనే విషయాలను కూడా పట్టించుకోని మహేష్ బాబు తనను పూర్తిగా నమ్మాడు. దాంతో కథ విషయంలో కొన్ని మార్పులు చేర్పులు చేసిన మురుగదాస్ మొత్తానికైతే స్పైడర్ సినిమా రూపంలో మహేష్ బాబుకి ఒక భారీ డిజాస్టర్ ను కట్టబెట్టాడు. 120



కోట్ల బడ్జెట్ తో తెరకెక్కిన ఈ సినిమా దాదాపు 50 కోట్ల వరకు నష్టాన్ని మిగిల్చింది...బ్రహ్మోత్సవం 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' సినిమాతో సక్సెస్ ని అందించిన శ్రీకాంత్ అడ్డాల తో మహేష్ బాబు మరో సినిమా చేయాలనుకున్నాడు.

ఒక సినిమాతో తనకి సక్సెస్ ను అందించిన దర్శకుడిని మరోసారి రిపీట్ చేస్తూ మూవీ చేయడం మహేష్ కి అప్పట్లో ఆనవాయితీగా మారింది. కాబట్టి సీతమ్మ వాకిట్లో మూవీ తరువాత మరోసారి శ్రీకాంత్ అడ్డాలను సైతం కథ రెడీ చేసుకోమని చెప్పాడు. దాంతో 'బ్రహ్మోత్సవం' కథతో శ్రీకాంత్ మహేష్ బాబు దగ్గరికి వచ్చాడు. నిజానికి మహేష్ బాబు ఆ పూర్తి కథ కూడా వినకుండా కేవలం శ్రీకాంత్ అడ్డాల మీద ఉన్న నమ్మకంతోనే అతనికి సినిమా ఇచ్చాడు. నిజానికి బ్రహ్మోత్సవం సినిమాలో కథ ఏమీ ఉండదు. ఎంతసేపు రిలేషన్ షిప్స్ మీదనే సినిమాను నడిపించే ప్రయత్నం చేశాడు. కానీ అందులో కోర్ ఎలిమెంట్ ఏంటి అనే విషయాన్ని పర్ఫెక్ట్ గా చెప్పలేకపోయాడు. ఎమోషన్స్ సైతం పర్ఫెక్ట్ గా హ్యాండిల్ చేయడంలో దర్శకుడు పూర్తిగా విఫలమయ్యాడు. సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాలో బ్రదర్స్ మధ్య బాండింగ్ చాలా గొప్పగా చూపించిన దర్శకుడు బ్రహ్మోత్సవం సినిమా విషయంలో పూర్తిగా చేతులెత్తేశాడు. దానివల్ల ఈ సినిమా భారీ ఫ్లాప్ గా నిలిచింది. దాదాపు 40 కోట్ల వరకు ప్రొడ్యూసర్లకు నష్టాన్ని మిగిల్చింది... ఆగడు దూకుడు సినిమాతో మహేష్ బాబుకు భారీ కంబ్యాక్ ను అందించిన శ్రీను వైట్ల దర్శకత్వంలో చేసిన 'ఆగడు' సినిమా పరిస్థితి కూడా ఇంతే... గబ్బర్ సింగ్ మూవీ ఫ్లేవర్ తో శ్రీను వైట్ల అలాంటి టెంపు లైన్ లోనే 'ఆగడు' సినిమాను తెరక్కెక్కించాడు. కానీ ఈ మూవీ అనుకున మేరకు విజయాన్ని సాధించలేదు. దాంతో ఈ మూవీ దాదాపు 30 కోట్ల వరకు నష్టాన్ని మిగిల్చింది... మహేష్ బాబు తన కెరియర్ లో ఎన్ని గొప్ప విజయాలను సాధించినా కూడా వెనుతిరిగి చూసుకుంటే అతని కెరియర్లో ఇలాంటి భారీ డిజాస్టర్లు ఉండడం అతనికి తీవ్రమైన బాధను కలిగిస్తుందట. అందుకే ఆయన ఇకమీదట చేయబోయే సినిమాల విషయంలో ఎక్కడా కూడా కన్ఫ్యూజన్ లేకుండా పూర్తి క్లారిటీతో ముందుకు సాగాలని ప్రొడ్యూసర్లను సేఫ్ జోన్ లో ఉంచడమే తన లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగుతున్నాడు.

ప్రస్తుతం రాజమౌళి దర్శకత్వంలో చేస్తున్న వారణాసి సినిమా బడ్జెట్ విపరీతంగా పెరిగిపోతున్నప్పటికి రాజమౌళి ఉన్నాడనే కాన్ఫిడెంట్ తో మహేష్ బాబు ఉన్నాడు. ఇక దానికి తగ్గట్టుగానే రాజమౌళి ఆ సినిమా కోసం ఎంత బడ్జెట్ పెట్టించినా కూడా అంతకుమించిన వసూళ్లను రాబట్టగలిగే కెపాసిటి రాజమౌళికి ఉంది. సినిమాని ప్రమోషన్స్ తోనే జనాల్లోకి తీసుకెళ్తాడు. మొదటి రోజు టికెట్ రేట్ ఎంత పెట్టినా సరే మనం ఆ సినిమా చూడాల్సిందే అనేంతలా ప్రేక్షకుడిలో ఒక క్యూరియాసిటీ రేకెత్తించడంలో రాజమౌళి సిద్ధహస్తుడు. కాబట్టి వారణాసి సినిమా విషయంలో మహేష్ బాబు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండొచ్చు. ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా 3,000 కోట్లకు పైన కలెక్షన్స్ ను రాబడుతుందనే అంచనాలో మేకర్స్ ఉన్నారు...

## దిగ్గజ దర్శకుడు

## సింగీతం శ్రీనివాసరావు కన్నుమూత



భారత సినీ యవనికపై తనకంటూ ఒక ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించుకున్న దిగ్గజ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు (94) శనివారం కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో చెన్నైలోని కావేరి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. ఆరు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ కెరీర్‌లో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో 60కి పైగా చిత్రాలకు దర్శకత్వం వహించి, భారతీయ సినిమా గతిని మార్చిన విలక్షణ సృష్టికర్తగా ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారు.

సింగీతం శ్రీనివాసరావు ప్రస్థానం 'మాయాబజార్' వంటి క్లాసిక్ చిత్రానికి కె.వి. రెడ్డి వద్ద సహాయకుడిగా ప్రారంభమైంది. ఆ తర్వాత దర్శకుడిగా మారి, భారత చలనచిత్ర చరిత్రలో మర్చిపోలేని చిత్రాలను అందించారు. ఆయన దర్శకత్వంలో వచ్చిన చిత్రాలలో ప్రయోగాలు ఒక ముఖ్యమైన భాగంగా ఉండేవి. సంభాషణలు లేని బ్లాక్ కామెడీ 'పుష్పక విమానం' (1987), భారతీయ సినిమాలో తొలి టైమ్-ట్రావెల్ సైన్స్ ఫిక్షన్ చిత్రంగా ఖ్యాతి పొందిన 'ఆదిత్య 369' (1991), సుధా చంద్రన్ జీవితం ఆధారంగా తెరకెక్కిన స్ఫూర్తిదాయక నృత్య కావ్యం 'మయూరి' (1985) వంటివి ఆయన సృజనాత్మకతకు తార్కాణాలు. కమల్ హాసన్‌తో ఆయన తీసిన 'అపూర్వ సహోదరులు', 'మైఖేల్ మదన కామరాజన్' చిత్రాలు కూడా కమర్షియల్‌గా భారీ విజయాలు సాధించాయి.సాంకేతికత అందుబాటులో లేని రోజుల్లోనే, గ్రాఫిక్స్, సీజీఐ హంగులు లేకుండానే తన కథనంతో ప్రేక్షకులను అబ్బురపరిచిన దర్శక మేధావి సింగీతం. ఆయన ప్రతిభకు జాతీయ చలనచిత్ర పురస్కారాలు, నంది అవార్డులు, ఫిలింఫేర్ అవార్డులు ఎన్నోసార్లు వరించాయి.అద్భుతమైన విషయం ఏమిటంటే, 94 ఏళ్ల వయసులో కూడా ఆయన మళ్లీ దర్శకత్వం చేపట్టారు. వైజయంతీ మూవీస్ సమర్పణలో నాగ్ అశ్విన్ నిర్మించిన 'సింగ్ గీతం' అనే మ్యూజికల్ ఫాంటసీ చిత్రానికి ఈ ఏడాది దర్శకత్వం వహించారు. కేవలం 77 రోజుల్లో చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకుంది.సింగీతం మృతి పట్ల సినీ, రాజకీయ ప్రముఖులు, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జూనియర్ ఎన్టీఆర్ నివాళులర్పిస్తూ, "ఆయన ఒక దార్శనికుడు. ఆదిత్య 369, పుష్పక విమానం, మయూరి వంటి ఆయన చిత్రాలు తరాలు మారినా తాజాగా అనిపిస్తాయి" అని పేర్కొన్నారు. బ్లాక్ అండ్ వైట్ 'మాయాబజార్' కాలం నుంచి 2026లో థియేటర్లలో విడుదలైన 'సింగ్ గీతం' వరకు ఆయన సినీ ప్రయాణం అసామాన్యమైనది, అజరామరమైనది.



# ఆసియా క్రీడల్లో భారత్ సంచలనం..

# 85 పతకాలతో నాలుగో స్థానం

జపాన్‌లోని ఐచీ--నాగోయా వేదికగా జరుగుతున్న 2026 ఆసియా క్రీడల్లో భారత బృందం ఘనంగా తన ప్రస్థానాన్ని ముగించింది. మొత్తం 85 పతకాలు సాధించిన భారత్ పతకాల పట్టికలో నాలుగో స్థానంలో నిలిచింది. భారత క్రీడాకారులు 21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్య పతకాలు సాధించారు. ఉజ్బెకిస్థాన్‌తో సమానంగా 21 స్వర్ణాలు సాధించినప్పటికీ భారత్ ఎక్కువ రజత పతకాలతో నాలుగో స్థానాన్ని దక్కించుకుంది. చివరి రోజైన శనివారం భారత్‌కు పతకాల వర్షం కురిసింది. పురుషుల హాకీ జట్టు ఫైనల్లో మలేసియాపై 5--1 తేడాతో విజయం సాధించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ విజయంతో భారత హాకీ జట్టు 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌కు కూడా అర్హత సాధించింది. అదే రోజున పురుషుల క్రికెట్ జట్టు కూడా పాకిస్థాన్‌పై విజయం సాధించి స్వర్ణ పతకం సాధించింది.




ఆర్చరీలో కుంకుమ్ మోహోద్, గోల్ఫ్‌లో ప్రణవి శరత్ ఉర్స్, కుస్తీలో అమన్ సెహ్రావత్ స్వర్ణాలు సాధించడంతో చివరి రోజు భారత పతకాల ఖాతా మరింత భారీగా పెరిగింది. భారత్‌కు అథ్లెటిక్స్ అత్యధిక పతకాలు అందించిన క్రీడాంశంగా నిలిచింది. ఈ విభాగంలో భారత్ ఒక స్వర్ణం, తొమ్మిది రజతాలు, 14 కాంస్యాలతో మొత్తం 24 పతకాలు సాధించింది. షూటింగ్‌లో 15 పతకాలు, ఆర్చరీలో తొమ్మిది పతకాలు, బాక్సింగ్, కుస్తీలో చెరో ఆరు పతకాలు భారత పతకాల సంఖ్య పెరగడంలో కీలకంగా నిలిచాయి. ఆర్చరీలో భారత్ ఐదు స్వర్ణాలు సహా తొమ్మిది పతకాలు సాధించింది. మహిళల వ్యక్తిగత రికర్వ్ విభాగంలో 17 ఏళ్ల కుంకుమ్ మోహోద్ స్వర్ణం సాధించి చరిత్ర సృష్టించారు. ఫైనల్లో దక్షిణ కొరియాకు చెందిన ఓ ఏజిన్‌ను షూట్‌ఆఫ్‌లో ఓడించిన ఆమె.. ఆసియా క్రీడల్లో మహిళల వ్యక్తిగత రికర్వ్ విభాగంలో భారత్‌కు తొలి స్వర్ణ పతకాన్ని అందించారు. ఈ విజయంతో ఆ విభాగంలో భారత్ సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది.




షూటింగ్‌లోనూ భారత క్రీడాకారులు సత్తా చాటారు. కమల్‌జీత్, సురుచి సింగ్ జోడీ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో స్వర్ణ పతకం సాధించింది.

మహిళల ట్రాప్‌లో నీరూ ధాండా, మిక్స్‌డ్ ట్రాప్‌లో కైనన్ చెనై--నీరూ ధాండా జోడీ కూడా స్వర్ణాలు సాధించారు. మొత్తంగా షూటింగ్ నుంచి భారత్‌కు 15 పతకాలు లభించాయి. బాక్సింగ్‌లో లవ్లీనా బోర్గోహైన్ 75 కేజీల విభాగంలో, పర్వీన్ హుడా 65 కేజీల విభాగంలో, అంకుష్ 80 కేజీల విభాగంలో స్వర్ణ పతకాలు సాధించారు. కుస్తీలో అమన్ సెహ్రావత్ 57 కేజీల విభాగంలో స్వర్ణం సాధించగా, సుజీత్ 65 కేజీల విభాగంలో మరో స్వర్ణాన్ని భారత్ ఖాతాలో చేర్చాడు. గోల్ఫ్‌లో ప్రణవి శరత్ ఉర్స్ మహిళల వ్యక్తిగత స్ట్రోక్ ప్లే విభాగంలో స్వర్ణ పతకం సాధించి భారత గోల్ఫ్‌లో చారిత్రక ఘనతను నమోదు చేశారు. క్రికెట్‌లో మహిళల, పురుషుల జట్లు స్వర్ణ పతకాలు సాధించగా.. హాకీలోనూ మహిళల, పురుషుల జట్లు పసిడి పతకాలు సాధించాయి. కబడ్డీలోనూ భారత మహిళల, పురుషుల జట్లు స్వర్ణాలు గెలుచుకున్నాయి. అథ్లెటిక్స్, షూటింగ్, ఆర్చరీతో పాటు బాక్సింగ్, కుస్తీ, క్రికెట్, హాకీ, కబడ్డీ, గోల్ఫ్, స్క్వాష్, వెయిట్‌లిఫ్టింగ్, వుషు తదితర క్రీడాంశాల్లో భారత క్రీడాకారులు పతకాలు సాధించారు. మొత్తంగా 21 క్రీడాంశాల్లో భారత్ పతకాలు గెలుచుకోవడం విశేషం. ఈ ఆసియా క్రీడల్లో భారత క్రీడాకారుల ప్రదర్శనలో చివరి దశలో సాధించిన వరుస విజయాలు ప్రత్యేకంగా నిలిచాయి. ముఖ్యంగా చివరి రోజున ఐదు స్వర్ణ పతకాలు సాధించడం ద్వారా భారత్ తన పతకాల పట్టిక స్థానాన్ని నాలుగో స్థానానికి తీసుకెళ్లింది. 85 పతకాలతో ఆసియా క్రీడల ప్రస్థానాన్ని ముగించిన భారత బృందం.. అంతర్జాతీయ క్రీడా వేదికపై తన సామర్థ్యాన్ని మరోసారి చాటుకుంది.



## ప్రపంచ ఛాంపియన్‌కు షాక్..

## రెజ్లింగ్‌లో అమన్ శెహ్రావత్‌కు గోల్డ్

ఆసియా క్రీడలు 2026లో భారత రెజ్లర్ అమన్ శెహ్రావత్ సంచలనం సృష్టించాడు. పురుషుల 57 కేజీల ఫ్రీస్టైల్ ఫైనల్లో ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ హాన్ చోంగ్ సాంగ్‌ను 11-7 తేడాతో ఓడించి స్వర్ణ పతకం సాధించాడు. దీంతో ఈ విభాగంలో ఆసియా క్రీడల స్వర్ణం గెలిచిన తొలి భారత రెజ్లర్‌గా అమన్ చరిత్ర సృష్టించాడు. ప్రస్తుతం ఆసియా క్రీడల్లో భారత స్వర్ణ పతకాల సంఖ్య 20కు చేరింది.నగోయా సిటీ ఇనాయే స్పోర్ట్స్ సెంటర్‌లో జరిగిన ఫైనల్ హోరాహోరీగా సాగింది. రెండో భాగంలో అమన్ 6-1 ఆధిక్యంలో ఉన్నాడు. అయితే ఉత్తర కొరియా రెజ్లర్ పుంజుకున్నాడు. వరుస పాయింట్లతో 7-6 ఆధిక్యంలోకి వెళ్లాడు.సమయం ముగిసే దశలో అమన్ అద్భుతంగా పుంజుకున్నాడు. టేక్‌డౌన్‌తో రెండు పాయింట్లు సాధించి, ఆ తర్వాత రోల్ ద్వారా మరో రెండు పాయింట్లు దక్కించుకున్నాడు. దీంతో 11-7 ఆధిక్యంలోకి వెళ్లాడు. ప్రత్యర్థి ఆ పాయింట్లపై ఛాలెంజ్ చేసినా ఫలితం లేకపోయింది.పైగా ఒక పాయింట్ కోల్పోవడంతో అమన్ ఆధిక్యం మరింత పెరిగింది. చివరి 30 సెకన్లలో ప్రత్యర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా స్వర్ణాన్ని ఖాయం చేసుకున్నాడు.అమన్‌కు ఇది ఆసియా క్రీడల్లో రెండో పతకం. 2023 హాంగ్‌జౌ క్రీడల్లో కాంస్యం సాధించిన అతడు.. ఇప్పుడు దానిని స్వర్ణంగా మార్చుకున్నాడు. పారిస్ ఒలింపిక్స్‌లోనూ అమన్ కాంస్య పతకం గెలిచాడు.అమన్ ఫైనల్‌కు ముందు అద్భుతంగా రాణించాడు. తొలి రౌండ్‌లో జపాన్‌కు చెందిన యమటో ఒగావాను 20-9తో ఓడించాడు. క్వార్టర్‌ఫైనల్లో కజకిస్థాన్‌కు చెందిన నుర్దానత్ ఐతానోవ్‌పై 12-1తో విజయం సాధించాడు. సెమీఫైనల్లో తజికిస్థాన్ రెజ్లర్ అయాల్ బెలోల్యుబ్‌స్కీ చేతిలో 2-6తో వెనుకబడ్డాడు. అయితే రెండో భాగంలో ఏకంగా 12 పాయింట్లు సాధించి 14-8తో గెలిచి ఫైనల్‌కు చేరాడు.ఇదే క్రీడల్లో పురుషుల 65 కేజీల ఫ్రీస్టైల్‌లో సుజీత్ కల్కల్ కూడా స్వర్ణం సాధించాడు. తజికిస్థాన్‌కు చెందిన అబ్దుల్ మజీద్ కుది యేవ్‌ను 10-9తో ఓడించాడు. దీంతో పురుషుల ఫ్రీస్టైల్‌లో భారత్ రెండు స్వర్ణాలు గెలవడం 1978 తర్వాత ఇదే తొలిసారి.

## పేద విద్యార్థుల పౌష్టికాహార పథకంలో

# అక్రమాల ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలి

- డీఈఓ సుబ్రహ్మణ్యంను తక్షణమే సస్పెండ్ చేయాలి
- జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- చర్యలు తీసుకోకపోతే జిల్లా వ్యాప్తంగా విద్యార్థి సంఘాల ఆందోళనలు ఉధృతం చేస్తాం

**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం:** అన్నమయ్య జిల్లా విద్యాశాఖలో డీఈఓ సుబ్రహ్మణ్యంపై వస్తున్న అవినీతి, అక్రమాల ఆరోపణలపై ఉన్నతస్థాయి విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న, ఏఐఎస్‌బీ జాతీయ కన్వీనర్ జాల జయవర్ధన్, పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి కొమ్మలపాటి సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. శనివారం రాయచోటిలోని డిప్యూటీ డీఈఓ కార్యాలయం వద్ద వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు అందించాల్సిన కోడిగుడ్లు, చిక్కీల సరఫరా, పంపిణీలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వచ్చినప్పటికీ, సెప్టెంబర్ 19 నుంచి ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.

పేద విద్యార్థుల పౌష్టికాహార పథకంలో అక్రమాల ఆరోపణలు రావడంపై జిల్లా కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకొని నిష్పక్షపాతంగా ఉన్నతస్థాయి విచారణ కమిటీని ఏర్పాటు చేయాలని, విచారణ పూర్తయ్యే వరకు డీఈఓ సుబ్రహ్మణ్యంను సస్పెండ్ చేయాలని డిమాండ్




చేశారు. కోడిగుడ్లు, చిక్కీల సరఫరా, పంపిణీ రికార్డులు, నిధుల వినియోగంపై సమగ్ర విచారణ జరిపి, ఆరోపణలు నిర్ధారణ అయితే బాధ్యులపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు దుర్వినియోగమైన ప్రభుత్వ నిధులను తిరిగి రాబట్టాలని కోరారు. జిల్లా కలెక్టర్ స్పందించి డీఈఓ సుబ్రహ్మణ్యంను తక్షణమే సస్పెండ్ చేయకపోతే పీడీఎస్‌యూ, ఏఐఎస్‌బీ, పీఎస్‌యూ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని నాయకులు హెచ్చరించారు. విద్యాశాఖ కార్యాలయాల ముట్టడి, జిల్లా కలెక్టరేట్ ముట్టడి వంటి కార్యక్రమాలతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, పేద విద్యార్థులకు న్యాయం జరిగి బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

---

## అన్నమయ్య జిల్లా డీఈఓ సుబ్రహ్మణ్యంపై

# ఎందుకు చర్యలు తీసుకోవట్లేదు...

- ఆర్జెడి శామ్యూల్ కమిటీలతోఎంతకాలం కాలయాపన చేస్తారు...?
- ప్రభుత్వ పాఠశాలలో అందించే పౌష్టికాహారంలో కోట్లల్లో అక్రమాలకు పాల్పడ్డం సిగ్గు చేటు
- ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి.యం.ఓబులేసు యాదవ్
- ఆర్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కడప పాఠశాల ఆర్జెడి కార్యాలయం వద్ద ఆందోళనలు

**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం :** ప్రభుత్వ పాఠశాలల్లో చిన్న పిల్లలకు ఇచ్చే గుడ్లు చిక్కిళల్లో అక్రమాలకు పాల్పడ్డ అన్నమయ్య జిల్లా డీఈఓ పై చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి. యం.ఓబులేసు యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం కడపలోని ఆర్జెడి కార్యాలయం వద్ద ఆర్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించారు. అన్నమయ్య జిల్లా డీఈఓ పైన చర్యలు తీసుకువాలని, ఆర్జెడి నిర్లక్ష్యనికి వ్యతిరేఖంగా ఆర్ఎస్ఎఫ్ నాయకులు నినదించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి. యం.ఓబులేసు యాదవ్ మాట్లాడుతూ సెప్టెంబర్ 19 వ తేదీ ఈ కుంభకోణం బయటికి వస్తే ఇప్పటి ఆర్జెడి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ఓబులేసు యాదవ్ ప్రశ్నించారు. అన్నమయ్య జిల్లాలోని ప్రతి పాఠశాలలో కూడా ప్రతి రోజు గుడ్లు చిక్కీలు విద్యార్థులకు




అందించిన్న లిస్ట్ పాఠశాల హెడ్ మాస్టర్ ఒకరకంగా పెడితే డీఈఓ మరొక రకంగా ప్రభుత్వ ఆన్లైన్‌లో పెట్టారన్నారు. ఇదంతా గత 2025 విద్యా సంవత్సరం అయితే, ఇప్పటి వరకు ఇంకెన్ని అక్రమాలు జరిగాయో విచారణ చేయాలన్నారు. సంవత్సరం అంతా కూడా జిల్లాలోని వందల ప్రభుత్వ పాఠశాలల్లో కోట్లల రూపాయలు అక్రమాలు జరిగియని అన్నారు. అయితే ఆర్జెడి శామ్యూల్ గారు మాత్రం కమిటీ ల పేరుతో కాలయాపన చేస్తున్నారాన్నారు. ఆర్జెడి డీఈఓ వ్యవహారంపై ఈ నెల 5 వ తేదీన కడప కు వస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారిని కలుస్తామని, అదేవిధంగా రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ గారికి కూడా ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తున్నట్లు ఓబులేసు యాదవ్ తెలిపారు.

---

# రాయదుర్గం రూరల్‌ను కరువు మండలంగా ప్రకటించాలి

- ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు



**రాయదుర్గం – సూర్య వాస్తవం :** రాయదుర్గం మండలంలో నెలకొన్న కరువు పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని దాన్ని కరవు మండలంగా ప్రకటించేలా ప్రభుత్వానికి అవసరమైన ప్రతిపాదనలు పంపాలని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ సాల్‌రెడ్డిని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆదేశించారు. అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం వ్యవసాయ శాఖ అధికారులతో ఎమ్మెల్యే ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు.

రాయదుర్గం నియోజకవర్గంలోని పంటల పరిస్థితి, వర్షపాతం, కరువు స్థితిగతులపై అధికారులతో చర్చించారు. రాయదుర్గం మండలంలో జూన్ 1 నుంచి సెప్టెంబర్ చివరి వరకు సాధారణంగా 311.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, ఈ ఏడాది కేవలం 144.4 మిల్లీమీటర్ల వర్షం మాత్రమే కురిసిందన్నారు. సాధారణ వర్షపాతంతో పోలిస్తే సుమారు 53 శాతం లోటు నమోదైందన్నారు. ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 20 వరకు వర్షపు చినుకు కూడా పడకపోవడంతో పంటలపై తీవ్ర ప్రభావం పడిందని పేర్కొన్నారు. రాయదుర్గం మండలంలో నెలకొన్న వాస్తవ పరిస్థితులు, వర్షపాతం లోటు, పంటల పరిస్థితిని సమగ్రంగా వివరిస్తూ ప్రభుత్వానికి తాజా ప్రతిపాదనలు పంపాలని కోరారు. అవసరమైతే ఈ అంశాన్ని ఉన్నతస్థాయిలో తాను పెద్దల దృష్టికి తీసుకెళ్లి పరి ష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే సూచన మేరకు రాయదుర్గం మండలంలోని వర్షపాతం, పంటల పరిస్థితి తదితర వివరాలతో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులకు తాజా ప్రతిపాదనలు పంపుతామని జాయింట్ డైరెక్టర్ సాల్‌రెడ్డి తెలిపారు.

---

## తాడిపత్రి తహసీల్దార్ కార్యాలయంలో... రికార్డులను పరిశీలించిన కలెక్టర్ ఓ.ఆనంద్...!

- పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కార తీరుపై కలెక్టర్ ఆరా
- ఎండార్స్‌మెంట్లు సక్రమంగా ఇవ్వకపోవడంపై అధికారులకు మెమోలు
- ప్రజా సమస్యల పరిష్కారంలో నాణ్యత పాటించాలని ఆదేశం

**అనంతపురం కలెక్టరేట్ – సూర్య వాస్తవం :** తాడిపత్రి మండల తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఐఏఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని వివిధ రికార్డులను పరిశీలించిన కలెక్టర్.. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందిన అర్జీల పరిష్కార తీరును సమీక్షించారు.పీజీఆర్ఎస్ అర్జీలను పరిష్కరించిన అనంతరం సంబంధిత దరఖాస్తుదారులకు ఇవ్వాల్సిన ఎండార్స్‌మెంట్లు సక్రమంగా ఇవ్వకపోవడాన్ని కలెక్టర్ గుర్తించారు. అర్జీల పరిష్కారంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు. నిబంధనలకు అనుగుణంగా ఎండార్స్‌మెంట్లు జారీ చేయని సంబంధిత అధికారులకు మెమోలు జారీ చేశారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలను బాధ్యతగా పరిశీలించి, పారదర్శకంగా పరిష్కరించాలని సూచించారు.



---

## శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామిని దర్శించుకున్న దేవాదాయ శాఖ స్థపతి పరమేశ్వరప్ప దంపతులు



**బ్రహ్మంగారిమఠం – సూర్య వాస్తవం:** జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారిని దేవాదాయ ధర్మాదాయ శాఖ స్థపతి పరమేశ్వరప్ప, వారి ధర్మపత్ని శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మఠం నూతన మేనేజర్ పీ.పీ.ఎన్. ప్రసాద్, మఠాధిపతుల వారి సోదరుడు దత్తాత్రేయ స్వామి ఆధ్వర్యంలో వారికి ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ ఈశ్వరి దేవి మఠం మఠాధిపతుల సోదరుడు సంపత్ కుమార్ స్వామి, ఎండోమెంట్ డిపార్ట్మెంట్ ఏఈ, సొసైటీ చైర్మన్ ఎల్లటూరు సాంబశివారెడ్డి, పూజా శివ యాదవ్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 15 నుంచి భూముల రీ సర్వే...



**కణేకల్ – సూర్య వాస్తవం :** భూముల రీ సర్వే కార్యక్రమంలో భాగంగా 7వ విడతలో కణేకల్ రెవెన్యూ గ్రామ పరిధిలో అక్టోబర్ 15 నుంచి భూముల రీ సర్వే నిర్వహించనున్నట్లు రెవెన్యూ అధికారి పవన్ కుమార్ తెలిపారు. ఈ మేరకు రైతులకు అవగాహన కల్పించేందుకు తహశీల్దార్ ఆధ్వర్యంలో ఈ నెల 6న మంగళవారం కణేకల్–2వ సచివాలయం వద్ద గ్రామసభ నిర్వహించను న్నారు. కణేకల్ గ్రామ పొలాలకు సంబంధించిన రైతులందరూ గ్రామసభకు హాజరై రీ సర్వేకు సంబం ధించిన వివరాలను తెలుసుకోవాలని అధికారులు సూచించారు. రీ సర్వేలో భాగంగా రైతుల వివరాలను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయనున్నందున పట్టాదారు పాస్‌పుస్తకం కలిగిన రైతులు అవసరమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని కోరారు.రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, ఒక పాస్‌పోర్ట్ సైజు ఫొటో, ఫోన్ నంబర్ సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ వివరాలను కణేకల్ పంచాయతీ కార్యాలయం సమీపం లోని గ్రామ చావిడి, కణేకల్–2వ సచివాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో రెవెన్యూ సిబ్బంది, గ్రామ రెవెన్యూ సహాయకులకు అందజేయవచ్చన్నారు.రైతులు నిర్ణీత సమయంలో అవసరమైన పత్రాలను సమర్పించి రీ సర్వే ప్రక్రియ సజావుగా సాగేందుకు సహకరించాలని గ్రామ రెవెన్యూ అధికారి పవన్ కుమార్ కోరారు.

## మండల ఓబిసి మోర్ఛా అధ్యక్షుడిగా పోతుల నరేష్ యాదవ్ నియామకం



**పామిడి – సూర్య వాస్తవం :** భారతీయజనతాపార్టీ జిల్లా అద్యక్షుడు కొనగొండ్ల రాజేష్ అదేశాల మేరకు పామిడి ఓబిసి మోర్చా మండల అధ్యక్షునిగా పోతుల నరేష్ యాదవ్ ను ఎంపిక చేసి బిజెపి మండలశాఖ ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఓబిసి మోర్చ జిల్లాఅధ్యాక్షుడు నాగేంద్ర, మండల బిజెపి అధ్యక్షుడు అంజినాయక్ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు పూజారి లక్ష్మిదేవి, మనోజ్, కుమార్ సుందరయ్య, రాజశేఖర గౌడ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## పోలేరమ్మ ఆలయంలో చోరీ...

- రెండు తులాల బంగారు తాళిబొట్టు, వెండి ఆభరణాలు అపహరణ



**బెళుగుప్ప – సూర్య వాస్తవం:** మండలంలోని నక్కలపల్లి గ్రామ శివారులో ఉన్న శ్రీ పోలేరమ్మ దేవాలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం రాత్రి ఆలయ తలుపులు పగులగొట్టి లోపలికి ప్రవేశించిన దుండగులు అమ్మవారి మెడలోని సుమారు రెండు తులాల బంగారు తాళిబొట్టుతో పాటు వెండి ఆభరణాలను అపహరించినట్లు గ్రామస్థులు తెలిపారు.శనివారం ఉదయం ఆలయ పూజారి పూజలు నిర్వహించేందుకు వెళ్లగా ఆలయ తలుపులు తెరిచి ఉండటాన్ని, అమ్మవారి ఆభరణాలు కనిపించకపోవడాన్ని గుర్తించారు. వెంటనే గ్రామస్థులకు సమాచారం అందించారు. అనంతరం పూజారి, గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనపై దర్యాప్తు చేపట్టారు. ఆలయంలో చోరీకి పాల్పడిన వ్యక్తుల వివరాలను సేకరించేందుకు పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఆలయంలో జరిగిన చోరీతో నక్కలపల్లి గ్రామంలో కలకలం నెలకొంది.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS
ADDRESS : 41/1320, Sankarapuram, Kadapa, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, CELL : : 9885404140